ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY

ప్రకాశం
జిల్లా వార్తలు
శనివారం 28, డిసెంబరు 2024



జిల్లాలో మూడు రోజులపాటు కురిసిన వర్షాలు శుక్రవారం తెరపి ఇచ్చాయి. దీంతో పంటలను కాపాడుకొనేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ వర్షాల వల్ల లక్ష ఎకరాల్లోని పంట పొలాల్లో నీరు చేరింది. ప్రధానంగా పొగాకు, శనగ, మినుము నీటిలోనే ఉన్నాయి. కోత కోసిన వరి ఓదెలు, కల్లాల్లోని మిరపకాయలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో నీటిని తొలగించి నష్టాన్ని తగ్గించుకొనే ప్రయత్నాలను రైతులు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం ఆగి కొద్దిగా ఎండ వచ్చింది. మరో రెండు రోజులు ఎండ కాస్తే పంట నష్టాలు మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. తాజా వర్షాలకు 11,505 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదించారు.



పంటలను కాపాడుకునేందుకు పాట్లు

నీటిలోనే లక్ష ఎకరాలు

- పొగాకు, శనగ, మినుముపై వర్ష ప్రభావం
- పలుచోట్ల వరి ఓదెలు, కల్లాల్లో మిర్చిదీ అదే పరిస్థితి
- మూడు రోజుల్లో 31.30 మి.మీ సగటు వర్షపాతం
- నీరు బయటకు పెడుతూ, మిరపకాయలు ఆరబెడుతూ అవస్థలు
- గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- ఎండలు కాస్తే మరింత నష్టం వెలుగు చూసే అవకాశం

ఒంగోలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షాలు శుక్రవారం తెల్లవారుజాము వరకు పడుతూనే ఉన్నాయి. గురువారం పగలు, రాత్రి తెరపి లేకుండా చాలాచోట్ల భారీ వర్షం కురిసింది. అలా మూడు రోజుల్లో జిల్లాలో సగటున 31.30 మి.మీ వర్షపాతం నమోదైంది. అందులో మూడో రోజే ఏకంగా 20.20 మి.మీ కురిసింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో పామూరు మండలంలో అత్యధికంగా 80.60 మి.మీ వర్షపాతం నమోదైంది. కొత్తపట్నంలో 56.8, సీఎస్‌పురంలో 47.2, కొండపిలో 45.2, జరుగుమల్లిలో 38.40, టంగుటూరులో 38.20, సంతనూతలపాడు

మిగతా 6వ పేజీలో

గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

జిల్లావ్యాప్తంగా పంటలు దెబ్బతినడంతో వ్యవసాయ. ఉద్యానశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) శ్రీనివాసరావు శుక్రవారం వెలిగండ్ల మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఇతర మండలాల్లోనూ స్థానిక అధికారులు పొలాలను పరిశీలించి తక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం తెరపి ఇచ్చి కొద్దిగా ఎండ వచ్చింది. మరో రెండు రోజులు ఎండ కాస్తే పంట నష్టాలు మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. ప్రస్తుతం పొలాల పరిస్థితిని పరిశీలిస్తే నష్టం భారీగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.



11,505 హెక్టార్లలో పంటలకు నష్టం

వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలకు 11,505 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కనిగిరి, దర్శి, ఒంగోలు, గిద్దలూరు, సింగరాయకొండ, మార్కాపురం నియోజకవర్గాల్లోని 155 గ్రామాల్లో 8,853 మంది రైతులకు చెందిన ఏడు రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. వర్షం తెరపి ఇచ్చి ఎండలు కాస్తుండటతో నష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రాథమిక అంచనా ప్రకారం వరి 776 హెక్టార్లు, మినుము 5,016 హెక్టార్లు, శనగ 1.686 హెక్టార్లు, పొగాకు 590 హెక్టార్లు, నువ్వు 126 హెక్టార్లు, అలసంద 3,266 హెక్టార్లు, జొన్న 45 హెక్టార్లలో దెబ్బతింది.



మెరుగైన బోధన అందించాలి

- వసతి గృహ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- పది, ఇంటర్‌లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
- ఒక్క ఫిర్యాదు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లో శుక్రవారం సంక్షేమ శాఖ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆ దిశగా ఇప్పటికే రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక, ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. విద్య, ఆరోగ్య భద్రతకు సంబంధించి విద్యార్థుల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేస్తూ పక్కాగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. వసతి గృహాల్లో ట్యూటర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణ కోసం పంచాయతీ, మునిసిపాలిటీల నుంచి ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్ భవనాల మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు

మిగతా 6వ పేజీలో

కనిపించని కేడర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) తమ పాలనలో చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రస్తుత విపక్ష వైసీపీ చేస్తున్న ప్రయత్నాలకు ప్రజాస్పందన పెద్దగా కనిపించడం లేదు. అందుకు విద్యుత్ చార్జీల పెరుగుదలను నిరసిస్తూ శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమాలు దర్పణం పట్టాయి. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆపార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు మినహా విద్యుత్ వినియోగదారులు కానీ, సాధారణ ప్రజలు కానీ కనిపించలేదు. ఆ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్న దర్శి గిద్దలూరు నియోజకవర్గాల కన్నా ఎర్రగొండపాలెంలో జరిగిన కార్యక్రమంలోనే నాయకులు అధికంగా కనిపించారు. ప్రస్తుతం పెరిగిన విద్యుత్ చార్జీలతో తమకు సంబంధం లేదని, గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందే ఈ నిర్ణయం తీసుకుందని సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ నుంచి కిందిస్థాయి వరకు ఘోషిస్తున్న విషయం విదితమే. ఇటీవల ఈ విషయంపై ఆందోళనలు చేసిన వామపక్షాలు సైతం పరోక్షంగా జగన్ ప్రభుత్వమే విద్యుత్ చార్జీల పెరుగుదలకు కారణమని అంగీకరిస్తూ ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం మోయాలంటూ డిమాండ్ చేశాయి. ఆయితే వైసీపీ మాత్రం ఈ పెరుగుదల పాపమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరిగినప్పటికీ అన్నిచోట్లా ఆపార్టీ నాయకులు మాత్రమే కనిపించారు. సాధారణ ప్రజలు కాదు కదా కనీసం ఆ పార్టీ కార్యకర్తలు కూడా లేరు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న దర్శిలో పాల్గొన్నారు. ఆయనతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఉన్నారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో కలిసి కార్యక్రమంలో

- జనం, వినియోగదారుల నుంచీ స్పందన నిల్
- నాయకులతో వైసీపీ విద్యుత్ ధర్నా
- ఆమడదూరంలో అసమ్మతి నేతలు
- ఈ పాపం వారిదే అన్న ఆరోపణపై స్పందన కరువు
- దర్శి కన్నా ఎర్రగొండపాలెంలోనే అధికం


విద్యుత్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న వై.పాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, వైసీపీ నాయకులు

మిగతా 6వ పేజీలో

అనుమతుల్లేని వెంచర్లపై ఉక్కుపాదం

- నోటీసులు జారీ చేస్తున్న మునిసిపల్ అధికారులు
- వారంలోపు తొలగించుకోకుంటే కఠిన చర్యలు
- కమిషనర్ నారాయణరావు హెచ్చరిక

మార్కాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో అనధికారిక వెంచర్లపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మూడు రోజులుగా వాటి యజమానులకు నోటీసులు ఇస్తున్నారు. వాటిని అందుకున్న వారు వారంరోజుల్లో అక్రమ వెంచర్లను తొలగించకపోతే తామే చర్యలు తీసుకుంటామని కమిషనర్ నారాయణరావు హెచ్చరించారు. మార్కాపురం పరిసరాల్లో ఇష్టారీతిన వందల సంఖ్యలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. సరైన రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర కనీస వసతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారీతిన వెంచర్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ దందాలో వ్యాపారుల అక్రమాలకు అంతేలేకుండా పోయింది. పట్టా భూములు కొని వాటిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ, అసైన్డ్, ఇరిగేషన్ భూములను సైతం ఆక్రమిస్తున్నారు. వాటిలోనూ యథేచ్ఛగా వెంచర్లు వేసి ప్రజలకు

మిగతా 6వ పేజీలో


మార్కాపురంలోని అనధికార లేఅవుట్

వామ్మో.. పులి!

- మొహిద్దీన్‌పురం వద్ద చిరుత సంచారం
- భయాందోళనలో ప్రజలు



కంభం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ పరిధిలోని అర్థవీడు మండలం మొహిద్దీన్‌పురం గ్రామ పరిసరాలలో చిరుతపులి సంచరిస్తోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి 11గంటలకు కంభం నుంచి అర్థవీడుకు నాగూర్‌వలి, మరో ఇద్దరు కారులో వెళ్తుండగా మొహిద్దీన్‌పురం-నాగులవరం గ్రామాల మధ్య రోడ్డు వెంట వారికి చిరుతపులి కనిపించింది. దీంతో వెంటనే వారు సమీపంలోని పొలంలో ఉన్న కాపరులకు విషయం చెప్పి అప్రమత్తం చేశారు. విషయం తెలుసుకుని తమ సిబ్బందిని ఆప్రాంతానికి పంపినట్లు మార్కాపురం డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, రైతులు, కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



హమ్మయ్య!

- వాగులో చిక్కుకున్న టెంపో
- 12 మంది ప్రయాణికులను కాపాడిన పామూరు పోలీసులు
- అందరూ కడప జిల్లా వాసులు



ఎస్సైతో మాట్లాడమంటే.. బయటకు నెట్టారు!

- వైసీపీ కోసం అహర్నిశలు పనిచేస్తే ఇన్‌చార్జి ఆదిమూలపు అవమానపరిచారు
- దుర్భాషలాడి తోసేశారు
- పార్టీ సింగరాయకొండ మండల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి ఆవేదన
- అధినేత జగన్ వద్దే సురేష్ సంగతి తేలుస్తానని ఆగ్రహం

వివరాలు 7వ పేజీలో

నిధుల దుర్వినియోగంపై విచారణ ప్రారంభం

7

- సింగరాయకొండ పంచాయతీలో రికార్డులను పరిశీలించిన త్రిసభ్య కమిటీ
- ఫిర్యాదుదారుల నుంచి వివరాల సేకరణ



కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక

- ఒంగోలులోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహణ
- హాజరుకానున్న 5,345 మంది అభ్యర్థులు
- ఎస్పీ దామోదర్ వెల్లడి

7

కోనంత.. తుళ్లింత..

సీఎస్‌పురం మండలంలో ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. గురువారం రాత్రి కురిసిన భారీవర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలయ ప్రాంగణం అంతా నీరు చేరింది. జలపాతాన్ని చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. దేవస్థాన అధికారులు మాత్రం ముందు జాగ్రత్తగా వారిని దూరం నుంచే చూసేలా చర్యలు తీసుకున్నారు.

- సీఎస్‌పురం(పామూరు), ఆంధ్రజ్యోతి

డంపర్ బోల్తా



రోడ్డు పక్కన పడిపోయిన డంపర్

మార్టూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):మార్టూరు పచ్చి మిర్చికూరగాయల మార్కెట్ ముందు ఉన్న సర్వీసు రోడ్డులో శుక్రవారం వేకువజామున డంపర్ వాహనం రోడ్డు పక్కన పడిపోయింది.డ్రైవరు నిద్రమత్తులో ఉండటంతో వాహనం రోడ్డు పక్కన సైడుకాల్వపైకి వెళ్లి బోల్తా పడింది. హైవే విస్తరణ పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్న డంపర్ వాహనం గ్రావెల్ కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

వాడరేవు - పిడుగురాళ్ల రహదారి పనుల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

పర్చూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల రహదారి పనులను కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. శుక్రవారం పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూములను పరిశీలించారు. అనంతరం రహదారి ఏర్పాటు కోసం చేపట్టిన భూముల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. హైవేరోడ్డు నిర్మాణంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ సుశీల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మైనార్టీ సంస్థలకు నిధులు విడుదలపై హర్షం

చినగంజాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మైనార్టీ సంస్థల నిర్మాణాల కోసం కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి జనవికాస్ పథకం ద్వారా విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు షేక్ జిలాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ సంస్థల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరుపున తొలి విడతగా రూ.26.13 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. నిధులు విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌డీ. ఫరూక్‌లకు జిలాని ధన్యవాదాలు తెలియజేశారు.

బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం

సమస్యలపై ప్రశ్నించిన వైసీపీ కౌన్సిలర్లు



హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, డిసెంబరు27(ఆంధ్ర జ్యోతి): బడ్జెట్ అంచనాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం 2024-25 రివైజ్డ్ బడ్జెట్, 2025-26 బడ్జెట్ అంచనాలు ప్రతిపాదించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్‌పర్సన్ తో పాటు మెజార్టీ కౌన్సిలర్ లు వైసీపీ తరపునే ఉన్నప్పటికీ నిర్ణయాలను మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించాల్సింది పోయి వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించటం పలువురిని విస్మయానికి గురిచేసింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్‌వో ప్లాంట్‌లలో 20 లీటర్ల నీరు 2 రూపాయల నుంచి 5 రూపాయలకు పెంచటం పట్ల 1, 20 వార్డుల కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు ప్రశ్నించారు. దీనికి స్పందించిన కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, 2 రూపాయలకు మించి వసూలు చేయవద్దని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలోనే చెప్పారని వివరించారు. అనంతరం 16 వ వార్డు కౌన్సిలర్ రమణ మాట్లాడుతూ భవానీ సెంటర్‌లోని రీడింగ్ రూమ్ స్థలాన్ని కొందరు స్వార్థానికి వినియోగించుకునేందుకు చూస్తున్నారని, అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో టీడీపీ కౌన్సిలర్‌లు సమస్యలపై ప్రశ్నించగా శుక్రవారం సమావేశం మాత్రం అందుకు భిన్నంగా వైసీపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించటం చర్చనీయాంశంగా మారింది. వైస్ చైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సంతరావూరు అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా

చినగంజాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : తానెక్కడున్నా సంతరావూరు గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో మాజీ జడ్పీ సీఈవో జంగం రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగిన ఆత్మీయ సత్కారసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభలో ఎంపీ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనకిందించిన ఆదరణను ఎప్పటికీ మరువనన్నారు. ముఖ్యంగా యువత స్వయంకృషితో ఎదగాలని, తమ భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. సంతరావూరు గ్రామ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆత్మీయ సత్కార సభలో ప్రసాదరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ప్రసాదరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితో ఆధునిక యువతీ యువకులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రసాదరావుకు గ్రామస్థులు పౌర సన్మానం చేసి ఆయనపై తమకున్న అనుబంధాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా ఎంపీ ప్రసాదరావుకు తన చిన్ననాటి స్నేహితుడు, మాజీ జడ్పీ సీఈవో రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త దేవతోటి నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరరావు, గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు పుష్పాలు, బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. ప్రాచీన సంప్రదాయాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ జట్కా బండిపై ఎంపీని గ్రామవీధులలో ఊరేగించారు. ఈ సత్కార కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, తేళ్ల అరుణ, టీడీపీ మండలం అధ్యక్షుడు పొద వీరయ్య, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగం ప్రవీణ్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవరపల్లి రాజేష్, నాయుడమ్మ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పార్వతి



చీరాలలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) :ప్రజలు తమ సమస్యలకు సంబంధించి ఇచ్చే అర్జీలను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. మండల పరిధిలోని అక్కాయిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే రెవెన్యూ సేవలు

చినగంజాం : రెవెన్యూ సేవలు ప్రజల చెంతకు చేర్చేందుకే సదస్సులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని టీడీపీ సీనియర్ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో రైతులు, ప్రజల నుంచి వివిధ సమస్యలపై 93 అర్జీలను స్వీకరించారు. మ్యూటేషన్ కోసం 8, ఎఫ్ లైన్ కోసం 81, పేరు సరిచేయుటకు ఒకటి, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం 3 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవతోటి నాగరాజు, కేశనపల్లి శ్యాంబాబు, మండల సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ నాగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 64 దరఖాస్తులు

మార్టూరు :మార్టూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజలనుంచి 64 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు టి.ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం 21, భూముల సర్వే కోసం 39 , 22 ఎ కోసం 3, ఎండోమెంట్ సమస్యపై 1 దరఖాస్తు వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రహమాన్ బాషా, మండల సర్వేయరు పి. ఏడుకొండలు, దేవాదాయ ఈవో శిరీష,తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : రెవెన్యూ సదస్సులలో ఎన్నో ఏళ్ల నుంచి భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో తహసీల్దార్ రవినాయక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి అందరికీ న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఆర్ఐ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



చినగంజాంలో సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ ప్రభాకర్‌రావు

కేజీబీవీ విద్యాలయం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ. డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఎంఈవో రమేష్ తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతిలో కేజీబీవీలో విద్యార్థినులకు భోజన కష్టాలు అన్న కథనం శుక్రవారం ప్రచురితం కావటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యాలయంలో వంట తయారు చేసే వారు నలుగురు ఉండగా అందరూ విధులకు గైర్హాజరు కావటంతో ఉపాధ్యాయులే భోజనం తయారు చేసి విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. ఉపాధ్యాయులు వంట చేస్తున్న విషయాన్ని అయన వారిని అడిగి తెలుసుకొన్నారు. వంట వారు రాకపోవటంతో పదిహేను రోజుల నుంచి తామే వంట చేసి పెడుతున్నామని ఉపాధ్యాయులు ఎంఈవోకు తెలిపారు. వారు తెలిపిన వివరాలను నివేదిక తయారు చేసి జిల్లా అధికారులకు రిపోర్టు పంపుతామని ఎంఈవో తెలిపారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఇంకొల్లు,డిసెంబరు 27,(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించినట్లయితే ప్రమాద సమయంలో ప్రాణహాని జరగకుండా కాపాడుకోవచ్చునని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. ఇంకొల్లులో శుక్రవారం రోటరీటవర్ నుంచి హెల్మెట్ ధరించడం వలన కలుగు ఉపయోగాలపై వాహనచోదకులకు అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ఇంకొల్లు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలో గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి స్టేషన్‌కు అనుసంధానం చేయడం పట్ల ఎస్సై సురేష్‌ను అభినందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాత్రివేళల్లో గస్తీ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ రమణయ్య,ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

మీసేవలో చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్



ప్రవీణ్‌కుమార్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం మీసేవ సెంటర్‌లో చోరీకు పాల్పడిన గొల్లంగి ప్రవీణ్‌కుమార్‌ను ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పద్మనాభపురానికి చెందిన ప్రవీణ్ విలాసాలకు బానిసగా మారాడు. ఈక్రమంలోనే పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడు. గతనెల 30వ తేదీన ఇదే తరహాలో ఈపూరుపాలెం ప్రధాన రహదారిలోని పలు దుకాణాల్లో చోరీలకు యత్నించాడు. కాటూరి చెంబయ్యకు చెందిన మీసేవ తాళాలు పగలకొట్టి రూ.30 వేలు అపహరించాడు. ఈనేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే సిగరాయకొండలో ఓ చోరీ కేసులో గాలింపు చేపట్టిన పోలీసులకు ఈపూరుపాలెం ఘటనపై కూడా నేరాన్ని ప్రవీణ్ అంగీకరించాడు. ఈక్రమంలో ఇక్కడి పోలీసులు పీటీ వారెంట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకోనున్నారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):ఆత్మహత్యాయత్నం చేసి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన చామర్తి నాగసరిత (45) అనే మహిళ మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని మార్టూరులోని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. మార్టూరు గ్రామానికి చెందిన నాగసరిత ఈ నెల 17 న ఇంటిలో ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విదితమే.

పరారీలో ఉన్న మహిళ అరెస్ట్

చీరాలటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గతకొంత కాలంగా ఎక్సైజ్ పోలీసులు కళ్లుగప్పి పరారీలో ఉన్న ఆదినారాయణపురంకు చెందిన ఆవుల అరుణను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఆమెపై గతంలో నాటుసారా కేసు నమోదయి ఉంది. మొగిలి రంగయ్య కాలనీలో 200 లీటర్లు , రామనగర్‌లో 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు వివరించారు. దాడుల్లో ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

పంటలను కాపాడుకునేందుకు పాట్లు

(5వ పేజీ తరువాయి)

పొన్నలూరు, ఒంగోలు, కనిగిరి, సింగరాయకొండ, పీసీపల్లి, మార్కాపురం, మద్రిపూడి, పొదిలి, కొమరోలు, బేస్తవారపేట తదితర మండలాల్లో 15నుంచి 35 మి.మీ కురిసింది. ఈనెల తొలివారంలోనూ ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. అనంతరం ఎండలు లేకుండా మంగు వాతావరణం కొనసాగడంతో చాలా చోట్ల పొలాలు ఆరలేదు. ఈ సమయంలో వరుసగా మూడు రోజులు ముసురు పట్టి పలు చోట్లభారీ వర్షాలు కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పంట పొలాలను ముంచెత్తిన వర్షపు నీరు

జిల్లావ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లోని పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. కొన్ని ప్రాంతాల్లో పంటలను ముంచెత్తగా, మరికొన్ని చోట్ల నష్టపరిచేలా కనిపిస్తోంది. ప్రధానంగా పొగాకు, శనగ, మినుము పంటలు అత్యధిక విస్తీర్ణంలో నీటిలో ఉండిపోయాయి. చాలాచోట్ల కంది, కోసి ఉన్న వరి ఓదెలు నీటిలో తేలియాడుతున్నాయి. కోసి ఆరబోసిన మిరపకాయలు కల్లాల్లోనే తడిసిపోయాయి. శుక్రవారం వర్షం తెరపి ఇవ్వడంతో రైతులు పొలంలోని నీటిని బయటకు పంపి అవకాశం ఉన్న మేర పంటను రక్షించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

మినుము, లేత పొగాకు తోటలకు తీవ్ర నష్టం

ఎక్కువ ప్రాంతాల్లో మినుము, లేతశనగ, లేత పొగాకు తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాపు బాగా ఉన్న సమయంలో వర్షం కురవడంతో మినుము కాయలు ఉబ్బి పగిలిపోతున్నాయి. కొన్నిచోట్ల మొలకలు కూడా వస్తున్నాయి. తడిసిన వరి ఓదెల్లోనూ మొలకలు కనిపిస్తున్నాయి. లేత శనగ నీట మునిగి కుళ్లిపోతోంది. దీంతో ఆయా పంట పొలాల నుంచి నీటిని బయటకుపంపడంతోపాటు వరి ఓదెలను తిరగేయడం, కల్లాల్లోని మిరపకాయలను ఆరబెట్టడం వంటి పనుల్లో రైతులు నిమగ్నయ్యారు.

మెరుగైన బోధన అందించాలి

(5వ పేజీ తరువాయి)

కోసం రూ.24 కోట్ల డీఎంఎఫ్ నిధులకు తాను అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో సంక్షేమశాఖ అధికారులు లక్ష్మానాయక్, అంజల, పార్థసారధి, అర్చన, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, డీపీవో వెంకటనాయుడు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ జయ పాల్గొన్నారు.

జనవరిలోపు మరమ్మతులను పూర్తిచేయాలి

సంక్షేమ వసతి గృహాల మరమ్మతులను జనవరి ఆఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయడంతోపాటు నాణ్యతను కూడా పర్యవేక్షించాలన్నారు. ఇతర ఇంజనీరింగ్ విభాగాలకు శాఖాపరమైన పనులు ఉన్నందున సమగ్ర శిక్ష అభియాన్‌కు కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని వసతి గృహాలను, ఏపీఈడబ్ల్యూఐడీసీకి మిగిలిన నియోజకవర్గాల్లోని వసతి గృహాలను కేటాయించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ భాస్కర్‌బాబు, సమగ్ర శిక్ష అభియాన్ ఈఈ ఎం.మన్నయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానంద్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని వెంచర్లపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

వాటిని అంటగట్టి కోట్ల రూపాయలు యజమానులు పోగేసుకుంటున్నారు. ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు మున్సిపల్ యంత్రాంగం నడుంబిగించింది. ఇప్పటికే అధికారులు 46 అక్రమ వెంచర్లను గుర్తించారు. ఈ అక్రమ వెంచర్లలో 19కి సంబంధించిన యజమానులకు నోటీసులు ఇచ్చారు. త్వరలో మిగిలిన వారికి కూడా నోటీసులు అందించనున్నారు.


అక్రమ లేఅవుట్‌లతోనే వ్యాపారం

మార్కాపురం పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆరు నెలల క్రితం వరకు జోరుగా సాగింది. మున్సిపాలిటీ నిర్దేశాలకు అనుగుణంగా ఒక్క వెంచర్ కూడా వేయలేదంటే అతిశయోక్తి కాదు. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఎడాపెడా పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం సాధారణ, వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాల కోసం రెవెన్యూశాఖ వద్ద ల్యాండ్ కన్వర్షన్ మాత్రమే చేస్తున్నారు. మిగిలిన ప్రక్రియ ఏదీ కూడా చేపట్టకుండానే ఇష్టారీతిన లేఅవుట్‌లు వేసి యథేచ్ఛగా అమ్మకాలు చేపడుతున్నారు. వాస్తవానికి ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్న తర్వాత లేఅవుట్‌కు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్కరూ ఆ దిశగా అనుమతి కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. ఎలాంటి ఖర్చు లేకుండా కేవలం కొద్దిపాటి వెడల్పుతో మట్టి రహదారులు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారు. మార్కాపురం పట్టణాన్ని ఆనుకొని ఐదేళ్ల కాలంలో చిన్నవి పెద్దవి సుమారు 350కి పైగా వెంచర్లు వెలిశాయి. ఇప్పుడు అధికారులు వీటిపైనే దృష్టిసారించారు.

లేఅవుట్‌లు వేయాల్సింది ఇలా...

- లేఅవుట్ వేసే భూమికి తొలుత ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి
- అనంతరం భూమి కొలతలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపుపొందిన ప్లానర్‌తో ప్లాన్‌ను తయారుచేసుకోవాలి.
- భూమికి సంబంధించిన ప్రభుత్వ డాక్యుమెంట్లు, రిజిష్టర్డ్ దస్తావేజులు, ప్లాన్‌ను మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారులకు అందజేయాలి.
- టౌన్ ప్లానింగ్ అధికారులు అన్ని రకాలుగా పరిశీలించి అనుమతులు మంజూరు చేసిన తర్వాతనే ప్లాట్‌ల అమ్మకాలు చేపట్టాలి.
- లేఅవుట్‌లో ఎకరాకు 10 శాతం చొప్పున యజమానులు మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలి.
- భవిష్యత్తు అవసరాలు కోసం 5 ప్లాట్లను ఈ భూమిని మున్సిపాలిటీకి మార్ట్‌గేజ్ చేయాలి.
- 40 అడుగుల వెడల్పుతో రోడ్లు, సీసీ కానీ బీటీతో కానీ పక్కాగా నిర్మించాలి.
- మురుగు కాలువలు, విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పించాలి.
- అన్ని వసతులు ఉంటేనే మున్సిపాలిటీ మార్టిగేజ్ చేసుకున్న ప్లాట్లను విడుదల చేస్తుంది.
- ఈ ప్రక్రియలు పూర్తయితేనే లే-అవుట్‌లో అమ్మకాలు ప్రారంభించాలి.
- అప్పుడే కొనుగోలుదారులు ఎలాంటి మోసాలకు గురికాకుండా సొంతింటి స్థలంను పొందుతాడు.

అక్రమ లేఅవుట్‌లను తొలగించుకోకుంటే చర్యలు



డీవీఎస్ నారాయణరావు

మార్కాపురం పట్టణ పరిధిలో మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసిన వారికి నోటీసులు ఇస్తున్నాం. ఇప్పటికే 19 లే-అవుట్‌లకు చెందిన వ్యాపారులకు నోటీసులు ఇచ్చాం. గతంలో 46 అక్రమ లేఅవుట్‌లకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేశాం. ఇక మిగిలిన వారికి కూడా త్వరలోనే నోటీసులు ఇస్తాం. వ్యాపారులు ఎవరికి వాళ్లు ప్లాట్ల కేటాయింపునకు వేసిన రాళ్లు తొలగించాలి. లేకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించి సంబంధిత వ్యాపారులు, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నోటీసు అందిన వారం రోజుల్లోగా ఎట్టి పరిస్థితుల్లో అక్రమ లేఅవుట్‌లను తొలగించుకోవాలి.

-డీవీఎస్ నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

కనిపించని కేడర్

(5వ పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ రెండుచోట్ల కన్నా ఎర్రగొండపాలెంలో ఆ పార్టీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమలోనే ఆ పార్టీశ్రేణులు ఎక్కువగా పాల్గొనటం విశేషం. ఉమ్మడి జిల్లా మొత్తంలో వైపాలెంలో ఎక్కువమంది వైసీపీ నాయకులు పాల్గొన్నారు. కనిగిరిలో ఒక్కొక్కరికి రూ.300 చెల్లించి ఒక కాలనీ నుంచి 300 మందిని సమీకరించినటు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. గిద్దలూరులో ఎప్పటిలాగే అసంతృప్త నాయకులు గైర్హజరయ్యారు. మార్కాపురంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు హనుమారెడ్డి ఆయన సతీమణి అయిన తర్లుపాడు జడ్పీటీసీ సభ్యురాలు గైర్హజరయ్యారు. కందుకూరులో నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులతోపాటు కిందిస్థాయిలోని ప్రజాప్రతినిధులు ఎవ్వరూ హాజరుకాలేదు. మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి పార్టీ నుంచి సమాచారం లేకపోవటంతో ఆయనతోపాటు ముఖ్యమైన పార్టీశ్రేణులు గైర్హజరయ్యారు. పర్చూరులో అమెరికా నుంచి వచ్చి బాలాజీ నాయకత్వం వహించినా 40మందికిలోపే హాజరుకావటం విశేషం. మాజీ మంత్రులు సురేష్, నాగార్జునలు పాల్గొన్న కొండపి, సంతనూతలపాడు కార్యక్రమాలు తూతూమంత్రంగా జరిగాయి.





రోడ్డు ఇలా.. చదువు ఎలా?

చిన ఉల్లగల్లు పాఠశాలకు వెళ్లే రహదారి పరిస్థితి ఇది

ముండ్లమూరు మండలంలోని చిన ఉల్లగల్లు నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి ఇది. ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైంది. ఈ రహదారి పక్కన ప్రాథమిక పాఠశాల ఉండటంతో బడికి వెళ్లే విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఇంటి దగ్గర నుంచి పాఠశాలకు సహజంగా పది నుంచి 15 నిమిషాలు పడుతుంది. అర కిలో మీటరు వరకు బురదమయం కావటంతో కాలు తీసి కాలు పెట్టలేని పరిస్థితి నెలకొనడంతో 30 నిమిషాలకుపైగా పడుతోంది. వీపుమీద పుస్తకాల బరువుతో బురదలో నడవలేక కొందరు బడికి వెళ్లడం లేదు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. - ముండ్లమూరు, (ఆంధ్రజ్యోతి)

ఎస్సైతో మాట్లాడమంటే.. బయటకు నెట్టారు!

- వైసీపీ కోసం అహర్నిశలు పనిచేస్తే ఇన్‌చార్జి ఆదిమూలపు అవమానించారు
- పార్టీ సింగరాయకొండ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి ఆవేదన
- అధినేత జగన్ వద్దే సురేష్ సంగతి తేలుస్తానని ఆగ్రహం

సింగరాయకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ కోసం అహర్నిశలూ పనిచేశా. పోలీసు స్టేషన్‌లో నాపై నమోదైన కేసు గురించి ఎస్సైతో ఒకసారి మాట్లాడండి అని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌ను అడిగితే కుదరదన్నారు. నాకే అన్యాయం జరిగితే పట్టించుకోరా? అని గట్టిగా నిలదీస్తే అసభ్య పదజాలంతో దూషించారు. నా గుండెల మీద చేతులు వేసి బయటకు నెట్టారు. నీ దిక్కున్న చోట చెప్పుకో అని బెదిరించారు' అని వైసీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సురేష్ సంగతి అధినేత జగన్ వద్దనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు. రవికుమార్‌రెడ్డి కథనం మేరకు.. శుక్రవారం ఉదయం కొండపిలో వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ఆపార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు రవికుమార్‌రెడ్డి సింగరాయకొండలోని ఆదిమూలపు సురేష్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ రవికుమార్‌రెడ్డి తనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు గురించి మాట్లాడాలని సురేష్‌ను కోరారు. ఇప్పుడు కుదరదు తరువాత చుద్దామని ఆయన కోపంతో చెప్పారు. దీంతో రవికుమార్‌రెడ్డి గట్టిగా మీరు స్టేషన్‌కు రావాల్సిందే అని పట్టుపట్టడంతో సురేష్ ఆగ్రహోదగ్రులయ్యారు. దుర్భాషలాడుతూ రవికుమార్‌రెడ్డిని గుండెలపై చేతులేసి బయటకు నెట్టారు. నిర్ఘాంతపోయిన ఆయన అక్కడే కాసేపు నేలపై బైఠాయించారు. పార్టీకోసం కష్టపడితే నన్నే అవమానిస్తారా? అని సురేష్‌ను నిలదీశారు. సురేష్ లోపలి గదిలోకి వెళ్లారు. అనంతరం వైసీపీ నాయకులు రవికుమార్‌రెడ్డికి సర్దిచెప్పి సురేష్ దగ్గరకు తీసుకెళ్లారు. లోపల కూడా ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. '15 ఏళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడుతుంటే నన్నే అవమానపరుస్తారా. పార్టీ అధినేత జగన్ దగ్గరే తేల్చుకుందాం' అంటూ రవికుమార్‌రెడ్డి సురేష్ క్యాంపు కార్యాలయం నుంచి బయటకు వచ్చేశారు. తరువాత తనకు జరిగిన అవమానాన్ని వైసీపీకి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేయించి పార్టీ శ్రేణులు తనకు న్యాయం జరిగే వరకూ అండగా ఉండాలని కోరారు.

మకాం మార్చడానికేనని చర్చ

వైసీపీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్‌కి, ఆపార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డికి మధ్య రచ్చ వ్యూహాత్మకంగానే జరిగిందన్న చర్చ పార్టీ శ్రేణుల్లో నడుస్తోంది. కొండపి నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో కూడా విజయం సాధించడం అసాధ్యమని సురేష్ భావిస్తున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఇక్కడి నుంచి సంతనూతలపాడుకు మకాం మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అందులో భాగంగానే పార్టీలో కీలకమైన రవికుమార్‌రెడ్డి పట్ల దురుసుగా ప్రవర్తించారని సొంతపార్టీ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. వివాదం విషయం అధిష్ఠానం దృష్టికి వెళ్తే.. త్వరగా నియోజకవర్గం మారుస్తారన్న భావనలో భాగంగానే సురేష్ అలా వ్యవహరించి ఉంటారని వైసీపీ నేతలు బహిరంగంగా మాట్లాడుకొంటున్నారు.

30 నుంచి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక



- పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహణ
- సీసీ కెమెరాల మధ్య పరీక్షలు
- ఎస్పీ దామోదర్ వెల్లడి
- హాజరుకానున్న 5,345 మంది అభ్యర్థులు

ఒంగోలు (క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేట్ లెవల్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రిలిమినరీ రాతపరీక్ష పాసైన వారికి ఫిజికల్ టెస్ట్, ఎఫిషియన్సీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. స్థానిక పోలీసు పెరేడ్ మైదానంలో జరిగే ఈ పరీక్షలను పూర్తిగా సీసీ కెమెరాల మధ్య నిర్వహిస్తున్నామని చెప్పారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కేవలం ప్రతిభ, దేహదారుఢ్య పరీక్షలు ఆధారంగా జరుగుతాయని స్పష్టం చేశారు. దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని ఎస్పీ చెప్పారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనేందుకు 4,435 మంది పురుషులు, 910 మంది మహిళలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులను ఎవరైనా మోసం చేయాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎంపిక పోటీల పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఆయన పలు సూచనలు చేశారు.

అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు

- అడ్మిట్ కార్డుతో నిర్దేశించిన తేదీల్లో 5 గంటలకే పోలీసు హెడ్‌క్వార్టర్స్ వద్ద హాజరు కావాలి
- టెన్త్, ఇంటర్మీడియట్ ఒరిజనల్ మార్కుల లిస్టులు తమతోపాటు తెచ్చుకోవాలి.
- డిగ్రీ ప్రొవిజనల్, ఒరిజనల్ మార్కులిస్టులు తెచ్చుకోవాలి
- క్రిమిలేయర్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలి
- ఆదివాసీయులు తమ ఒరిజనల్ ట్రైబల్ సర్టిఫికెట్ తీసుకురావాలి.
- ఎక్స్ సర్వీస్‌మెన్, మెరిటోరియస్ సర్టిఫికెట్, పోలీసు చిల్డ్రన్ ఆఫ్ పర్సనల్ సర్టిఫికెట్ ఉంటే తెచ్చుకోవాలి
- గర్భిణులైన అభ్యర్థులు ఉంటే పీఈటీ మినహాయింపు కోసం ఎస్ఎల్‌పీఆర్‌బీకి మెయిల్ చేయాలి.
- హోంగార్డు లేటెస్ట్ సర్వీస్ సర్టిఫికెట్, స్కోర్‌కార్డు, స్టేజ్-1, స్టేజ్-2 అప్లికేషన్లు తీసుకురావాలి. ఆయా అంశాలలో ఏదైన సందేహం ఉంటే హెల్ప్‌లైన్ సెల్ నంబరు 91211 02266కు కాల్ చేసి తెలుసుకోవాలని ఎస్పీ అభ్యర్థులను కోరారు.

జిల్లాలో 20.2 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 20.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పామూరులో అత్యధికంగా 80.6 మి.మీ కాగా అత్యల్పంగా పుల్లలచెరువు మండలంలో 1.0 మి.మీ కురిసింది. కొత్తపట్నం మండలంలో 56.8, సీఎస్‌పురం 47.6, కొండపి 45.2, జరుగుమల్లి 38.4, టంగుటూరు 38.2, సంతనూతలపాడు 34.8, పొన్నలూరు 33.0, ఒంగోలు 32.0, హనుమంతునిపాడు 26.6, సింగరాయకొండ 24.2, కనిగిరి 23.0, పొదిలి 22.6, పీసీపల్లి 19.6, మర్రిపూడి 16.2, మార్కాపురం 16.0, కొమరోలు 16.0, బేస్తవారపేట 15.2, తర్లుబాడు 14.0, వైపాలెం 13.8, అర్ధవీడు 13.8, వెలిగండ్ల 12.2, త్రిపురాంతకం 12.0, చీమకుర్తి 12.0, పెద్దారవీడు 11.8, కొనకనమిట్ల 11.2, కంభం 10.2, దొనకొండ 10.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 1.0 నుంచి 9.8 మి.మీ వాన కురిసింది.

విశ్రాంత పోలీసు అధికారులకు ఆత్మీయ సన్మానం

ఒంగోలు (క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని పోలీసు కళ్యాణ మండపంలో జిల్లా పోలీసు విశ్రాంతి అధికారులు, సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన విశ్రాంత పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు విశ్రాంత సిబ్బంది కోసం పోలీసుశాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేష్‌క్రిష్టన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ దామోదర్‌తో సన్మాన గ్రహీతలు



రికార్డులను పరిశీలిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

నిధుల దుర్వినియోగంపై విచారణ ప్రారంభం

- సింగరాయకొండ పంచాయతీలో రికార్డులు పరిశీలించిన త్రిసభ్య కమిటీ

సింగరాయకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై నిగ్గుతేల్చడానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ ప్రారంభించింది. కమిటీ సభ్యులు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్, డీపీవో కార్యాలయ పరిపాలన అధికారి రాజేంద్రప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయ సహాయ అడిట్ అధికారి రమేష్ శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు చేసిన ఫిర్యాదుదారులతో ప్రత్యేకంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. అనంతరం వారి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. పూర్వపు పంచాయతీ కార్యదర్శులు శరత్‌బాబు, రామ్మోహన్, ఈవోఆర్డీ అంజలీదేవిని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ తాటిపర్తి వనజను విచారించారు. ఈ విచారణ నేడు కూడా కొనసాగనుంది.

విద్యార్థులకు అత్యాధునిక కోర్సులు నేర్పాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా స్కిల్ సెంటర్లు అత్యాధునిక కోర్సులు నేర్పాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీ శిక్షణ, ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్స్, సంకల్ప్ కార్యక్రమాలపై మాట్లాడారు. జిల్లాలో ఉన్న వివిధ ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్స్‌లో అత్యాధునిక కోర్సులను విద్యార్థులకు బోధించాలన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలకు అత్యధిక మొత్తంగా నిరుద్యోగ యువత పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీల్లో డిమాండ్‌కు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు శ్రీనివాసరావు, రవికుమార్, శ్రీమన్నారాయణ, మదన్‌మోహన్, ధనలక్ష్మి, లక్ష్మానాయక్, గాయత్రీదేవి, అర్జున్‌నాయక్, వెంకటేశ్వరరావు, ఏపీ.నాగేశ్వరరావు, కె.బెన్‌హర్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ పెంచేలా చర్యలు తీసుకోవాలి

జిల్లాలో సౌర విద్యుత్ వినియోగం పెంచేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఐదువేలకు పైగా జనాభా ఉండి ఎక్కువ స్థాయిలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోటి రూపాయలు ఇవ్వనుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ప్రత్యేక గ్రామాల్లో ఈదిశగా సాధించిన పురోగతిని సమీక్షించి తగిన సూచనలు చేశారు. జిల్లాలో తూర్పునాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే సదస్సులు

జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరమైన సమస్యలకు సత్వర పరిష్కారాన్ని అందించటానికే ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను ప్రతి గ్రామంలో నిర్వహిస్తుందని జేసీ గోపాలకృష్ణ, తెలిపారు. శుక్రవారం పి.నాయుడుపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో జేసీ గోపాలకృష్ణ, జిల్లా సర్వేశాఖాధికారి గౌస్‌బాషాతో కలిసి పాల్గొని ప్రజలనుంచి అందిన అర్జీలను స్వీకరించారు. గ్రామానికి చెందిన రైతు తన పొలం విస్తీర్ణంలో తగ్గుదల ఉందని సరిచేయాలని అర్జీ ఇవ్వగా తక్షణమే సర్వేయర్‌తో కలిసి సదరు భూమిలోకి వెళ్లి స్వయంగా సర్వే చేయించి పరిశీలించారు. తదుపరి శ్మశానం ఆక్రమణకు గురైందన్న అర్జీకి తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. మొగిలిగుండాల రిజర్వాయర్‌ని ఏర్పాటు చేసి తమ ప్రాంతానికి సాగునీటి సమస్యను తీర్చాలని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కూరాకుల కరుణాకరరెడ్డి కోరారు. సమావేశంలో తృహసీల్దార్ బ్రహ్మయ్య, నాయకులు ఇస్తర్ల ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి, మోహనరెడ్డి పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

దివ్యాంగుల సంక్షేమశాఖలో ఉద్యోగ నియామకాలపై విచారణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమశాఖలో నాల్గవతరగతి ఉద్యోగుల నియామకాల్లో జరిగిన అక్రమాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు విచారణ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఈ విచారణ జరిగింది. ఇటీవల గ్రీవెన్స్ సెల్‌లో దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా భర్తీ చేసిన నాల్గవ తరగతి ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ అంధులు, విభిన్న ప్రతిభావంతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావును విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆయన ఫిర్యాదుదారులను విచారించారు. ఆ పోస్టుల నియామకానికి సంబంధించిన పలు ఆధారాలను అడిగి తెలుసుకున్నారు.



దివ్యాంగులను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

పైరు.. చూస్తే కన్నీరు!



కేవీ పాలెంలో దెబ్బతిన్న మినుము

రెండ్రోజులుపాటు కురిసిన వర్షాలకు చీమకుర్తి మండలంలోని బూదవాడ, కేవీపాలెం, పులికొండ తదితర గ్రామాల్లో పైర్లు దెబ్బతిన్నాయి. వరి నేలకొరిగింది. మినుముకు తెగులు సోకింది. కందిలో పూత రాలింది. ఆ పొలాలను ఏవో భాస్కర్ శుక్రవారం పరిశీలించారు. తెగుళ్ల ఉధృతి లేకుండా నివారణ చర్యలను వివరించారు.

- చీమకుర్తి, ఆంధ్రజ్యోతి



పులికొండలో నేలకు ఒరిగిన వరి పైరు

క్విస్ విద్యార్థులకు అవార్డులు

ఒంగోలు విద్య, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు బ్యాంకు ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులు లభించాయి. అకడమిక్స్, రీసెర్చ్, క్రీడా విభాగాల్లో విజయాలు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులు ఈ అవార్డులు అందుకున్నారు. ఆయా విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.31వేల నగదు బహుమతిని అందించారు. శుక్రవారం స్థానిక కళాశాల సెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణచక్రవర్తి, బ్యాంకు ఆఫ్ బరోడా ఆర్ఎం కిరణ్‌రెడ్డి, చీఫ్‌మేనేజర్ సుబ్రహ్మణ్యం విజేతలకు బహుమతులు అందజేశారు. బీటెక్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థుల్లో వందశాతం హాజరు సాధించిన వారికి క్విస్ స్టార్టప్ కంపెనీ శ్రీచక్ర గిఫ్ట్ అండ్ బియాండ్స్ వారు ప్రత్యేక బహుమతులు అందజేశారు. అనంతరం సూర్యకళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ బ్యాంకు ఆఫ్ బరోడా అచీవర్స్ అవార్డులను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, డీన్ జె.శ్రీనివాసరావు, అధ్యాపకులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

30న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసనలు

● వామపక్ష నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షాను చేసిన వ్యాఖ్యలపై ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఈ నెల 30న ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక సుందరయ్యభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడం దారుణంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఈనెల 30న జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్.సాయి, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఆర్.వెంకట్రావు, నల్లూరి మురళీ, కొత్తకోట వెంకటేశ్వర్లు, కె.వీరారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

పొన్నలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి పొన్నలూరు శివార్లలోని మిర్చి యార్డు వద్ద చోటుచేసుకుంది. ఎస్సై అనూక్ కథనం మేరకు.. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నేలపాటి నరసింహారావు పొన్నలూరు శివారులోని మిర్చి యార్డు వద్దకు మోటార్ సైకిల్‌పై బయల్దేరాడు. యార్డు సమీపంలోకి వెళ్లే సరికి వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో నరసింహారావుకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని కందుకూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

పొలాల్లోని నీటిని బయటకు పంపాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపాలని వ్యవసాయధికారి డి.విజయ్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుర్రప్పడియ, నెన్నూరుపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పొగాకు, శనగ, మినుము, కంది, వరి పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకటరావు, జ్యోత్స్నబాయి, వెంకటనారాయణ రైతులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

సంతనూతలపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై కేంద్రహోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసిస్తూ ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి ఆధ్వర్యంలో సంతనూతలపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఐద్వా మహిళా నాయకులు పాల్గొన్నారు

పరిశ్రమల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం


కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాపరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు నిర్దుష్ట గడువు వరకు వేచి ఉండకుండా సత్వరమే నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం కింద వచ్చిన అర్జీలను వెంటనే బ్యాంక్‌లకు పంపాలని చెప్పారు. ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలకు సంబందించి 280 క్లెయిమ్స్‌కు గాను రూ.6.19 కోట్లు మంజూరు జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఒంగోలు ఆటోనగర్‌లో సైడుకాలువలు, రోడ్డులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. గుండ్లాపల్లి ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రానైట్ వ్యర్థాలు కోసం డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్నారు.గ్రానైట్ ఎగుమతులు కోసం చెన్నై పోర్టుకు వెళ్లటం వల్ల ఒక్కో కంటైనర్‌కు రూ.20వేలు అదనంగా ఖర్చు అవుతుందని, అందువల్ల కృష్ణపట్నం పోర్టులో ఒక బెర్త్‌ను గ్రానైట్ ఎగుమతులుకు కేటాయించే ఏర్పాట్లు చేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ బి.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీటీసీ సుశీల, ఏపీసీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మ్యాపింగ్‌పై పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏఎన్ఎం గర్భిణుల వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మ్యాపింగ్‌లో, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న వివరాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ భగీరధి, సుగుణమ్మ, డాక్టర్ ప్రీతం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలి

● సీపీఐ నేత ఈశ్వరయ్య డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ అదనపు భారాలను ప్రభుత్వమే భరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ భారాలు ఉండవని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరునెలలు గడవక ముందే విద్యుత్ భారాలు వేయడం దారుణంగా ఉందన్నారు. ఈ భారాలు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఇప్పుడు అధికారంలో ఉండేది వైసీపీనా, టీడీపీ కూటమినా అని ప్రశ్నించారు. ట్రూఅప్ చార్జీల పేరుతో సుమారు రూ.25వేల కోట్ల భారాలు వేయడం తగదన్నారు. జగన్ తప్పు చేశారు కాబట్టే ప్రజలు ఇంటికి పంపారని, అదే తప్పును తాము చేస్తామని చెప్పడం తగదని ప్రశ్నించారు. అదాని విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఆర్.వెంకట్రావు, కె.వీరారెడ్డి, మురళి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలి

● మాజీ మంత్రి మేరుగ నాగార్జున


సంతనూతలపాడు విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సంతనూతలపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు శుక్రవారం సంతనూతలపాడులోని విద్యుత్ కార్యాలయం వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత ఒక మాట చెప్పి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ డి.చెంచిరెడ్డి, ఎంపీపీలు బి.విజయ, యుద్దనపూడి శ్రీను, మండవ అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కొంతసేపు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్, పూర్వపు ఇన్‌చార్జి డాక్టర్ మాదాసి వెంకయ్య, ఆరు మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నాయకుల కన్నా కార్యకర్తలే ఎక్కువ మంది కనిపించారు. పలు మండలాల నుంచి వైసీపీ ప్రభుత్వంలో పదవులు పొందినవారు హాజరు కాలేదు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. కరోనా సమయంలో విస్తృతంగా వైద్యసేవలు అందించిన మగ ఆరోగ్య కార్యకర్తలను రెగ్యులర్ చేయక పోగా కోర్టు పేరుతో ఉద్యోగం నుంచి తొలగించడం దుర్మార్గంగా ఉందని విమర్శించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.సురేష్, శ్రీధర్‌బాబు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ..ప్రాణ రక్షణ పొందండి

● డీఎస్పీ శ్రీనివాసరావు


హెల్మెట్ ధరంచి వాహనచోదన చేస్తున్న వ్యక్తిని అభినందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు(క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ లేని వారికి తలకు గాయమై చాలా మంది మృతి చెందుతున్నారని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహన చోదన చేయాలని కోరారు. శుక్రవారం ఒంగోలు నగరంలో హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ రక్షణ పొందవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వివరించారు. రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం నగరంలో హెల్మెట్ ధరించి వాహన చోదన చేస్తున్న వారిని పోలీసు అధికారులు అభినందించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు శుభాకాంక్షలు


డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లును వైద్యఆరోగ్యశాఖ మినిస్ట్రీరియల్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సేవాసంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం దుంపా అనుపమ జన్మదిన వేడుకల్లో భాగంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పీఎస్ఎస్.చౌదరి, హసీనాబేగం, కె.వెంకటేశ్వర్లు, పోలిశెట్టి, మల్లారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు స్పందన

ఒంగోలు(రూరల్), డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూసదస్సుకు మంచి స్పందన వచ్చింది. రైతులు, గ్రామస్థులు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్ వాసుకు అందజేశారు. కార్యక్రమంలో డీటీలు శీలం శ్రీనివాసరావు, అశోక్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో ప్రవీణ్, ఎంపీటీసీ శ్రీనివాసరావు, నాయకులు చెన్నుపాటి భాస్కర్, నీటి సంఘం అధ్యక్షుడు కంకణాల వేణు, కాకర్ల లక్ష్మయ్య పాల్గొన్నారు

కొండపి: చినకండ్లగుంటలో జరిగిన రెవెన్యూ గ్రామ సభలో 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పి.మురళి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నరసారెడ్డి, రీసర్వే డీటీ కాశయ్య, సర్వేయర్ రాజు, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

నాగులుప్పలపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఐ బి.శ్రీకాంత్ శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏడు క్వార్టర్ బాటిళ్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

వైసీపీ ధర్నాలు చేయడం విడ్డూరం

● టీడీపీ బీసీ సెల్ నేత నారాయణస్వామి

కొండపి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచడంతోపాటు, రకరకాల అదనపు చార్జీలు వడ్డించారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి విమర్శించారు. ఇప్పుడు కరెంటు చార్జీలు తగ్గించాలని ఆ పార్టీ నాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు కూడా కాలేదన్నారు. వనరులను సమీకరించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తుంటే వైసీపీ నాయకులు విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు గడచిన సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వైసీపీ నాయకులు తీరుమార్చుకోలేదన్నారు. వైసీపీ పాలనలో అనేక రకాలుగా దెబ్బతిన్న ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని, మళ్లీ వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాన్ని ఆపార్టీ నాయకులు చేస్తున్నారన్నారు. ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

మన్మోహన్‌సింగ్ మృతికి మాగుంట సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తాను ఎంపీగా పార్లమెంట్‌లో ఉండటం, వారి నుంచి అనేక గొప్ప విషయాలను నేర్చుకున్నానని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసంతాపాన్ని వ్యక్తం చేశారు.

వైస్ చాన్స్‌లర్ నివాళి

ఒంగోలు విద్య: ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన మేధావి, మాజీప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యూనివర్శిటీలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర్, బి.పద్మ, ఐ.దేవీవరప్రసాద్, పిల్లి వెంకటరావు, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన సీతమ్మ, పక్కన ఫైల్ ఫొటో

మద్దిపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మద్దిపాడు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగింది. మద్దిపాడుకు చెందిన సీతమ్మ(80) మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉంటుంది. ఈక్రమంలో ఆమె అర్ధరాత్రి సమయంలో ఒంగోలు జాతర రెస్టారెంట్ వైపు జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహిళా సమాఖ్య సమావేశం

మద్దిపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని వెలుగు కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మహిళా సమాఖ్య వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం కె.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వెలుగు సీసీలో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి సాయం


సాయం అందజేస్తున్న దాతలు

కొండపి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై నాలుగు నెలల నుంచి మంచంలోనే ఉంటున్న పోలిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన నల్లపు వెంకటరావును కొండపికి చెందిన ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. బాధితుడికి వీల్‌చైర్‌తోపాటు, రెండు నెలలకు పరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కొండపి జీజేసీ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు రెండు వేల రూపాయలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, మండల కార్యాలయ ఏవో రామకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పెన్షన్‌దారుల సమావేశం

ఒంగోలు(రూరల్), డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఒంగోలులోని ఏపీ ఎన్‌జీవో సంఘ ఫంక్షన్‌హాలులో జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బడే అంకిరెడ్డి, డాక్టర్ కంచర్ల సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. జిల్లాలోని పెన్షన్‌దారులు పాల్గొనాలని వారు కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఒంగోలు విద్య, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం కరవది పీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఇంటర్ విద్యార్థినుల కోసం రెండు పుస్తకాల ర్యాక్‌ను గ్రామానికి చెందిన రిటైర్డ్ పీడీ చుండూరి కోటేశ్వరరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పీవీఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

ఒంగోలు విద్య, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపును తాత్కాల్ స్కీం కింద వచ్చే నెల 10వతేదీ వరకు పొడిగించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. వచ్చేనెల 10లోపు ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్‌ను అందజేయాలని ప్రధానోపాధ్యాయులను కోరారు.

ఉపకారవేతనం అందజేత


మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులతో విద్యార్థులు

సంతనూతలపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన ఉల్లాస్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలు జడ్పీహైస్కూల్లో 9, 10వ తరగతి చదివే పలువురు విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున మెరిట్ స్కాలర్‌షిప్‌ను సంతనూతలపాడులో చెక్కును అందజేశారు. మండలంలో 80మంది విద్యార్థులకు కలిపి రూ.80 వేలను సంస్థ ప్రతినిధులు దింటకుర్తి బాలక్రిష్ణ, శిరీషలు ఎంఈవో వెంకారెడ్డి, హెచ్ఎం ఉమామహేశ్వరికి అందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన పౌలు

మద్దిపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం పెద్దకొత్తపల్లి డొంక వద్ద జాతీయ రహదారిపై జరిగింది. పెద్దకొత్తపల్లి గ్రామం అరుంధతినగర్‌కు చెందిన జె.పౌలు అలియాస్ పవన్‌కుమార్ జాతీయ రహదారికి వచ్చే క్రమంలో ఒంగోలు నుంచి శివరాంపురం వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో పౌలు ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. బైక్‌పై వస్తున్న దంపతులకు స్వల్పగాయాలు కాగా 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అవీ..ఇవీ

రెండు కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురు వ్యక్తుల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలో 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ పట్టణ శివార్లలోని మోడంపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో గంజాయిని అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో దాడి చేయగా 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఆ నలుగురిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

కంభం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాల సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకొంది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం, సూరేపల్లి గ్రామానికి చెందిన బీరం సుబ్బారెడ్డి (55) కంభం నుండి స్వగ్రామం వెళుతున్నాడు. కిరణ్ నడిమిపల్లి నుంచి కంభం వస్తున్నాడు. వీరి రెండు ద్విచక్ర వాహనాలు కంభంలోని బాలికల గురుకుల పాఠశాల వద్ద ఢీ కొన్నాయి. ఈ ఘటనలో సుబ్బారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాగుపాము కలకలం

గిద్దలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజానగర్‌లోని ఒక నివాస గృహంలో శుక్రవారం నాగుపాము కలకలం సృష్టించింది. ఇంటి ఆవరణలో నాగుపాము అటూ ఇటూ తిరుగుతూ పడగ విప్పుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం మేరకు అటవీశాఖ రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన అక్కడకు వెళ్లి నాగుపామును బంధించి నల్లమల అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం తీరనిలోటు అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మన్మోహన్‌సింగ్ కుటుంబానికి ఆయన ప్రగాడ, సానుభూతి వ్యక్తం చేశారు. దేశాన్ని ముందుకు నడిపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది మంది శ్రామికులకు ఉపాధి కల్పించి వారి కుటుంబాలలో వెలుగులు నింపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అన్నారు. ఆయన మరణం భారతదేశానికి తీరనిలోటు అన్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని అన్నివిధాలా అభివృద్ధి, ప్రగతిపథంలో నడిపించిన వ్యక్తి అని ఆయన అన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం

గిద్దలూరు : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతిపట్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక సంస్కరణలు చేపట్టిన మన్మోహన్‌సింగ్‌ను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

విశ్రాంత పీఈటీ నందిగం ఏలియా మృతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు నందిగం ఏలియా(81) శుక్రవారం ఆయన నివాసంలో మృతి చెందారు. ఈయన పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, పుల్లల చెరువు ఉన్నత పాఠశాల, మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఈపూరుపాలెం, పెద్దారవీడు మండలం బద్వీడు చర్లోపల్లెలో వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేశారు. బద్వీడు చర్లోపల్లిలో ఉద్యోగ విరమణ చేశారు. విద్యార్థులను క్రీడల్లో రాణించేలా కృషి చేసి ఆయా పాఠశాలలలో అనేక పతకాలు సాధించిపెట్టారు. ఉద్యోగ విరమణ అనంతరం సంఘ సేవకుడిగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఏబీఎం పాలెంలోని మన్రో ప్రార్థనా మందిరం పాస్టర్‌గా రెవరెండ్ డా.నందిగం ఏలియా పనిచేశారు. శనివారం ఉదయం 10 గంటలకు ఏబీఎం పాలెంలోని మన్రో ప్రార్థనా మందిరంలో స్తుతి కూడిక నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఏలియా (ఫైల్)

వేమలకోటలో పాముకాటుకు వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి).: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వేమలకోట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుంజె చెన్నయ్య (45) గ్రామ సమీపంలోని తన స్నేహి తుని పొలంలో శుక్రవారం సొరకాయ కోసే క్రమంలో పాముకాటు వేసింది. దీంతో ఆయన అక్కడిక్కడే పడిపోయాడు. పొలంలో సమీపంలో ఉన్న మరో వ్యక్తి చెన్నయ్య కింద పడి ఉండడాన్ని గమనించాడు. దగ్గరలోని సర్వజన వైద్యశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు చెన్నయ్యకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కయిన చెన్నయ్య పాముకాటుకు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డిలు సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తంచేశారు.



చెన్నయ్య (ఫైల్)

వైసీపీ ధర్నాలు చేయడం విడ్డూరం

● టీడీపీ బీసీ సెల్ నేత నారాయణస్వామి

కొండపి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో విచ్చల విడిగా విద్యుత్ చార్జీలు పెంచడంతోపాటు, రకరకాల అదనపు చార్జీలు వడ్డించారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి విమర్శించారు. ఇప్పుడు కరెంటు చార్జీలు తగ్గించాలని ఆ పార్టీ నాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెల్లు కూడా కాలేదన్నారు. వనరులను సమీకరించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తుంటే వైసీపీ నాయకులు విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు గడచిన సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పినా వైసీపీ నాయకులు తీరుమార్చుకోలేదన్నారు. వైసీపీ పాలనలో అనేక రకాలుగా దెబ్బతిన్న ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని, మళ్లీ వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాన్ని ఆపార్టీ నాయకులు చేస్తున్నారన్నారు. ఇలాంటి రెచ్చగొట్టే కార్యక్రమాలను ఇకనైనా

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ● కారుమానుపల్లి నుంచి మధ్యలో నుంచి వెళ్లిపోయిన తహసీల్దార్

కొనకనమిట్ల, డిసెంబరు 27 : భూసమస్యలు పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ పాలనలో భూదోపిడిపై సమగ్ర విచారణ చేయించి నిజమైన భూయజమానులకు న్యాయం చేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో దుర్మార్గాలకు అంతేలేకుండా పోయిందన్నారు. వాటిని సరిచేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చారన్నారు. ఈ చట్టం ద్వారా పేదప్రజల భూములకు డోకా లేకుండా పోతుందన్నారు. భూదందాతో పాటు మద్యం, ఇసుక దోపిడీకి అంతే లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్‌పైనే 1.27 వేల కోట్లు బకాయి పెట్టి రాష్ట్రప్రజలను దీవాల తీయించారని తెలిపారు. ఇప్పుడు ఏమి ఎరగనట్లు విద్యుత్ చార్జీలపై కపట నాటకాలాడుతున్నారన్నారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. డిస్కమ్‌లకు విద్యుత్ చార్జీలు పెంచాలనే జీవోను ఇచ్చారని అది ఇప్పుడు అమలు చేస్తుంటే కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతోందన్నారు. విద్యుత్‌చార్జీలను వారిపాలనలోనే పెంచిఇప్పుడు నిరసన తెలపడం దొంగే దొంగన్నట్లుగా ఉందని ఎద్దేవ చేశారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కనుక భూసమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. రెవెన్యూ సదస్సుకు మొత్తం 20 అర్జీలు రాగా వాటిలో ఒకటి పరిష్కరించామని తహసీల్దార్ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మాధవరెడ్డి, వీఆర్‌వోలు రమేష్, జానయ్య, దిలీప్, పలువురు వీఆర్‌వోలు, మండల ఇన్‌చార్జి సర్వేయర్ రాజశేఖర్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

కంభం : మండలంలో గతంలో జరిగిన భూరికార్డులను అవతవకలను సరిదిద్దేందుకే గ్రామాలలో నెల రోజులుగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. శుక్రవారం కందులాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల సమస్యలు వీలైనంత వరకు ఇక్కడే పరిష్కరిస్తామన్నారు. సదస్సులను సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సిద్ధయ్య, సర్పంచ్ రజని, అధికారులు పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలో కారుమానుపల్లి, పత్తేపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలు తూతూమంత్రంగా జరిగాయి. తహసీల్దార్ విజయ్‌భాస్కర్ ఉదయం 11.30 గంటలకు భూసమస్యలు పరిష్కరించలేనంటూ రెవెన్యూ గ్రామసభ నుంచి అర్థాంతరంగా సెలవుపెట్టి వెళ్లిపోయారు. దీంతో కారుమానుపల్లిలో తూతూమంత్రంగా గ్రామ సభ నిర్వహించారు. సాయంత్రం పత్తేపురంలో ఉన్నతాధి కారులు లేకుండానే వీఆర్‌వో మల్లికార్జున గ్రామసభ నిర్వహించి ముగించారు. తహసీల్దార్ లేకుండా గ్రామసభ ఎలా నిర్వహిస్తారంటూ రైతులు వీఆర్‌వో, సర్వేయర్‌లపై వాగ్వాదం చేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రామసభ నిర్వహించినట్లు సర్వేయర్ సురేష్ తెలిపారు.

ఎర్రగొండపాలెం రూరల్ : స్థానిక డా.బి.ఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో తహసీల్దార్ ఏ బాలకిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూ సమస్యలపై మొత్తం 16 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంటి స్థలం కోసం 8, ముటేషన్ 1 పలు ఇతర సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు చంద్రశేఖర్, దానం, ఎల్లయ్య, సర్వేయర్లు దిలీప్, వేమారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.





కంభం మండలం కందులాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్, వై.పాలెంలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్

వైసీపీకి ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక గుడ్‌బై

మార్కాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి వైసీపీకి శుక్రవారం రాజీనామా చేశారు. స్థానిక ఎస్‌వీకే నిలయం (రీడింగ్ రూమ్)లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తన వ్యక్తిగత కారణాల రీత్యా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాను 1989 నుంచి 2009 వరకు టీడీపీలో కొనసాగానన్నారు. 2009లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు వైసీపీలో కొనసాగు తున్నట్లు తెలిపారు. తనకు అన్ని పార్టీలు సముచిత కల్పించాయన్నారు. తన కుటుంబ సభ్యులు, అనుచరులు, అభిమానులతో చర్చించిన అనంతరం భవిష్యత్తు నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ షెక్షావలి, అనుచరులు బత్తుల మల్లిఖార్జున్‌రెడ్డి, గుంటక శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతోమాట్లాడుతున్న గుంటక సుబ్బారెడ్డి

విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు

వైసీపీ నేతల ఆరోపణ

మార్కాపురం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడుతో కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డిలు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తర్లుపాడు రోడ్డులోని పెద్దట్యాంకు నుంచి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యేలు రాంబాబు, వెంకటరెడ్డిలు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచనని పలుమార్లు చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టారీతన ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు షంషీర్‌అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అన్ని మండలాల నుంచి వచ్చిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ర్యాలీ

గిద్దలూరు : పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. రాచర్లగేటు సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి వెళ్లారు. ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేశారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థు లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కుందూరు నాగార్జునరెడ్డిలు మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం 6 నెలల్లో రూ.15వేల కోట్ల మేర విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలపై అనేక రకాలైన భారాలను కూటమి ప్రభుత్వం మోపుతుందని ధ్వజమెత్తారు. ఇక నుంచి ప్రతి ప్రజా సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ పోరుబాట

ఎర్రగొండపాలెం రూరల్ : విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు ఐదు మండలాల నాయకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐదు మండ లాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

గిద్దలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కె.యర్రయ్య కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని వివిధ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. ఉపాధ్యాయులను కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. గత ఏడాది నుంచి రుణాలు, గ్రాట్యూటీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సర్వీసు రెగ్యులరైజేషన్‌కు సంబంధించి డీఈవో కార్యాలయం నుంచి రెండు నెలలు అయినా ప్రభుత్వానికి పంపకపోవడం ఆలసత్వాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. యాప్‌ల భారం నుంచి మినహా ఇంపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్దిక్, మండలశాఖ నాయకులు ప్రసాద్, కాశయ్య, బాలగురువయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రానికి బస్సును ఏర్పాటు చేయాలి

పుల్లలచెరువు, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు మండలం కేంద్రం నుంచి జిల్లా కేంద్రం ఒంగోలుకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మార్కాపురం ఆర్టీసీ డీపో మేనేజరు నరసింహారావును పుల్లలచెరువు సీపీఐ మండల కార్యదర్శి జి గురునాథం కోరారు. శుక్రవారం పుల్లలచెరువు బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చిన మేనేజరుకు బస్టాండ్ వున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ ఒంగోలుకు ప్రభుత్వ పనులపై వెళ్లేందుకు బస్సులేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలని అన్నారు. నియోజకవర్గ కేంద్రం ఎర్రగొండపాలెం నుంచి కూడా ఒంగోలుకు బస్సులు నేరుగా లేవని ఈ సర్వీస్ ద్వారా ఎర్రగొండపాలెం ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరుగుదొడ్లు, నీరు లేక ఇబ్బందులు పడుగున్నారని అన్నారు. బస్టాండ్‌లో లైట్లు లేక రాత్రి వేళలో ప్రయాణీకులు ఇబ్బంది పడుతునాన్నరని అన్నారు. అదేవిధంగా మార్కాపురం వయా పుల్లలచెరువు మీదుగా హైదరాబాద్‌కు బస్సును వేయాలని కోరారు. ఉన్నాతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్ళి బస్సు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డీఎం తెలిపారు.



మార్కాపురం డిపో మేనేజరు నరసింహారావుతో మాట్లాడుతున్న గురునాథం

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో వెలసిన జగదాంబ, మార్కండేశ్వర స్వాములకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల మధుసూదన శర్మలు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. జగదాంబకు కుంకు మార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేష అలంకరణలో జగదాంబ

పరిశ్రమల అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు(రూరల్), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాపరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు నిర్దుష్ట గడువు వరకు వేచి ఉండకుండా సత్వరమే నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో వివిధ పరిశ్రమ లకు చెందిన వివిధ రాయితీలకు సంబంధించి 280 క్లెయిమ్స్‌కు గాను రూ.6.19 కోట్లు మంజూరు జరిగిందని తెలి పారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఒంగోలు ఆటోనగర్‌లో సైడుకాలువలు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. గుండ్లాపల్లి ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రానైట్ వ్యర్థాలు కోసండం పింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్నారు.. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ బి.శ్రీని వాసరావు, డీఆర్ డీఏ పీడీ రవికుమార్, డీటీసీ సుశీల, ఏపీసీడీ సీఎల్ ఎస్ఈ వెంకటే శ్వర్లు, డీఎల్‌డీవో వై.మహాలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, కమిషనర్ వెంకటేశ్వ రరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌వో

ఒంగోలు కలెక్టరేట్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిగా బాధ్యత లు స్వీకరించిన డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలె క్టర్ చాంబర్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్‌ను కలి సి మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టరేట్ లోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మ్యాపింగ్‌పై పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎం లతో ప్రత్యేక సమావేశం



కలెక్టర్ అన్సారియాకు బొకే ఇస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

పరీక్ష ఫీజు గడువు పెంపు

ఒంగోలు విద్య, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపును తాత్కాల్ స్కీం కింద వచ్చే నెల 10 వతేదీ వరకు పొడిగించినట్లు డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవ చ్చన్నారు. వచ్చేనెల 10లోపు ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్‌ను అందజేయాలని ప్రధానోపాధ్యాయులను కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న పైర్లు

● మిర్చి కంది, శనగ పైర్లపై తీవ్ర ప్రభావం ● తెగుళ్ల ఉధృతిలో రైతుల్లో ఆందోళన ● ఆదుకోవాలని కోరుతున్న ప్రజలు

తర్లుపాడు, అక్టోబరు 27 ఆంధ్రజ్యోతి: నాలుగు రోజుల నుంచి అల్ప పీడనం ప్రభావంతో ముసురు వాన కురవటంతో వేసిన పొగాకు, మిర్చి, కంది, శనగ, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు తెగుళ్ల విజృంభించటంతో పవర్ స్ప్రేయర్ ద్వారా మందులను పిచికారి చేస్తున్నారు. కళ్లాల్లో ఆరబోసిన మిర్చి కూడా తడిచి బూజెక్కటంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాయలను తిరగదిప్పుకుంటూ బూజు పట్టిన కాయలను వేరు చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించి రైతులు పలు సూచనలు చేశారు. వర్షానికి ముందు కోసిన వరి బోదెలు తడిచి మొలకెత్తుతున్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. దెబ్బతిన్న పంటలకు, తెగుళ్లకు మందుల గురించి రైతులకు సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రైతన్నలు నట్టేట మునిగారు.



దోర్నాలలో మిరపకు ఆరబెడుతున్న రైతు

త్రిపురాంతకం : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ధాన్యం కల్లాలను మండల వ్యవసాయాధికారిణి కె.నీరజ శుక్రవారం పరిశీలించారు. వెల్లంల్లి, రాజుపాలెం, విశ్వనాథపురం గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కల్లాల్లో తడిచిన, ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోతలు జరిగి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ఆధ్వర్యంలో లారీల ద్వారా మిల్లులకు పంపారు. వర్షం తగ్గుముఖం పట్టడంతో రైతులు తమ ధాన్యాన్ని తేమ లేకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. ఎవరైనా రైతులు తమ ధాన్యం తడిచినా, రంగు మారినా అధైర్యపడవద్దన్నారు. ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్ద దోర్నాల : దోర్నాల మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న ముసురువాన శుక్రవారం తెరిపివ్వడంతో మిరప రైతులు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు వానకు తడవకుండా ఉండేందుకు టార్పలిన్ పట్టలు కప్పి ఉంచడంతో కాయలు మచ్చలు ఏర్పడి తేమ శాతం ఎక్కువ కావడంతో పూర్తిగా నాణ్యత కోల్పోయి తాలుకాయలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందారు. వాన వెలిసి ఎండరావడంతో పట్టలు తొలగించి మిరప కాయలను మరో చోటికి తిరగబోశారు. కొందరు మంచి కాయల నుండి మచ్చ కాయల ను వేరు చేశారు. వాటిని తాలు కాయలుగా మరో చోట ఆర బెడుతున్నారు. మరి కొందరు మిరపతో పాటు మినుము, కంది, బొబ్బర, ఆముదం, పప్పుశనగ, తదితరముల పైర్లకు తెగుళ్ల నివారణ కోసం కొత్త తెగుళ్ల ఆశించ కుండా పైపాటుగా మందులు పిచికారి చేస్తూ పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



త్రిపురాంతకంలో ధాన్యం కల్లాన్ని పరిశీలిస్తున్న ఏవో నీరజ

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

దొనకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి దివంగత మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం స్థానిక గౌతమీ డిగ్రీ కాలేజీ అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామయోగి మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం భారత దేశానికి తీరనిలోటని అన్నారు. ప్రధానమంత్రిగా మంచి సుపరిపాలన అందించి తనదైన మార్క్‌ను పాలనాపరంగా ప్రజలకు చాటిచెప్పారని తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని), అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దొనకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దొనకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని వివిధశాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని కోరారు.

తాళ్లూరులోనూ..

తాళ్లూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

పామూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఉగ్ర కుమార్తె ఊహశ్రీ జన్మదిన సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు చిమట పట్టాభిస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యారవశ్రీను, కేవీ రమణయ్య, కావిటి సుబ్బయ్య, ఎం. హుసేన్‌రావు, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, ఎన్.సాంబయ్య, పండిటి హరీష్, బి.సత్యం, ఎం.గిడ్డయ్య, మెంటా నరసింహారావు, మల్లికార్జున రావు బి.నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్.బెనర్జిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8008822821 నెంబరును సంప్రదించాలని కోరారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

తాళ్లూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్డుదారులందరికీ సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.సంజీవరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలకు ఎండీఎం వాహనాల్లో రేషన్ తరలించి కార్డుదారులందరికి అందించాలన్నారు. కార్డుదారులకు రేషన్ అందించలేదని ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలుగ్రామాలకు రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

30న నిరసనలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షాను చేసిన వ్యాఖ్యలపై ఆయనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈక్రమంలో ఈ నెల 30న ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజనల్ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక సుందరయ్యభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడం దారుణంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ .నారాయణ మాట్లాడుతూ ఈనెల 30న జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్.సాయి, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఆర్.వెంకట్రావు, నల్లూరి మురళీ, కొత్తకోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షార్పణం

- నిండా మునిగిన మినుము రైతు
- ఆదుకోవాలని వేడుకోలు
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు

పామూరు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు మినుము రైతు నిండా మునిగాడు. కోత దశలో ఉన్న మినుము పంటను ఇంటికి తెచ్చుకొందాం అనుకొంటున్న తరుణంలో వరుణుడు కోలుకోలేని దెబ్బతీశాడు. పామూరు మండలంలో 888 హెక్టార్లు, సీఎస్‌పురం మండలంలో 580 హెక్టార్లలో మినుము సాగు చేశారు. ఎకరాకు రూ.15 వేల వరకు రైతులు ఖర్చుపెట్టారు. మార్కెట్‌లో కింటా రూ.7 వేలు ధర పలుకుతుండటంతో మంచి లాభం వస్తుందనుకుంటున్న తరుణంలో అకాల వర్షం దెబ్బతీసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి, గుమ్మలంపాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, మోపాడు, లక్ష్మీనరసాపురం, కరోళ్లపాడు, ఇనిమెర్ల, నుచ్చుపొద, చిలంకూరు. దూబగుంటతో పాటు సీఎస్‌పురం మండలంలోని పెద గోకులపల్లి, వెంగనకుంట, కె.అగ్రహారం, సి.నాగులారం తదితర గ్రామాల్లో మినుము సాగు చేశారు. కొన్ని గ్రామాల్లో మినుము కోతలు కోసి ఓదేలు వేశారు. గురువారం రాత్రి కురిసిన అధిక వర్షానికి మినుము పంట ఎందుకు పనికి రాకుండా పోయింది. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారంపై నివేదిక అందజేస్తాం



పామూరు: మినుము పైరులో నిలిచిన వర్షపు నీరు



పీసీపల్లి: వెంగళాయపల్లిలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పామూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కురిసిన ముసురు వానతో పాటు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మినుము పంట దెబ్బతిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న మిను ము పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. కోతలు కోసి ఓదేలుపై ఉన్న తరుణంలో వర్షం కురవడంతో పంట కుళ్లిపోయి బూజుపట్టి దెబ్బతిందన్నారు. త్వరలో పంట నష్టంపై సర్వే చేయించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కాగా వగ్గంపల్లి గ్రామంలో పలువురు రైతులకు 80 శాతం రాయితీ కింద కాక్ 2 రకం తెల్ల శనగలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రమణ, ఏవో రాధ పాల్గొన్నారు.



కుళ్లిపోయిన మినుము కాయలు

పంట నష్టం అంచనాలు తయారుచేయాలి

పీసీపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టానికి సంబంధించి అంచనాలు తయారుచేయాలని కనిగిరి ఏడీఏ రమణ, పీసీపల్లి వ్యవసాయ అధికారి ప్రకాశరావును జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. వెంగళాయపల్లి గ్రామంలో దెబ్బతిన్న మినుము, ఇతర పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22వేల ఎకరాలలో మినుము సాగుచేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము కొన్ని ప్రాంతాలలో దెబ్బతిందని చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలను అంచనా తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అకాల వర్షాలకు సాగుచేసిన కంది, మినుము, మిరప తదితర పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరపతయ్య పేర్కొన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పంటలు సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తించేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారికి విన్నవించారు. ఈసందర్భంగా మండలంలో రైతులు సాగుచేసిన పంటల వివరాలు, వాటి విస్తీర్ణం, దెబ్బతిన్న పంటల విస్తీర్ణం వివరాలను అంచనావేసి తనకు నివేదించాలని ఏడీఏ, ఏవోలను శ్రీనివాసరావు ఆదేశించారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- తహసీల్దార్ రమాదేవి

దొనకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీకీ ప్రాధాన్యత ఇస్తూ శాశ్వత పరిష్కారం చూపటం జరుగుతుందని తహసీల్దార్ రమాదేవి స్పష్టం చేశారు. మండలంలోని భూమనపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. భూసమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత సమస్యల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటమే ధ్యేయంగా ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదు ఇస్తున్నట్టు చెప్పారు. భూమనపల్లి సదస్సులో మొత్తం 14 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, టీడీపీ నాయకులు విప్పర్ల శేషు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..



దొనకొండ: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలి



కనిగిరి: భూసమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దర్శి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎర్రోబనపల్లిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

పామూరు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలోనే రైతులకు సంబంధించిన భూసమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శుక్రవారం మండలంలోని కంభాలదిన్నె గ్రామ సచివాలయంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా 41 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, మన్నం రమణయ్య, ఏలూరి నరసింహారావు, ననుమూరి వెంకటేశ్వర్లు, ప్రత్యేకాధికారి ఎం.పానకాలరావు, డీటీ బ్రహ్మయ్య, ఆర్‌ఐ బి.మల్లికార్జునరావు, ఎండోమెంట్ ఈవో నరసింహాబాబు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

కనిగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కెళ్ళపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు భూసమస్యలపై అర్జీలు ఇచ్చారు. వీటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పిచ్చాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో పెండింగ్ భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరిస్తున్నట్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని పసుపుగల్లులో జరిగిన సదస్సులో 12 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. వీటిని ప్రాధాన్యతక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ రికార్డుల్లో సవరణలు, భూముల సరిహద్దుల వివాదం, దారి సమస్యలు, రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేస్తున్నట్టు చెప్పారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ పీఎస్ఆర్ మూర్తి, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వోలు బి.గురవయ్య, సీహెచ్ బ్రహ్మతేజ, కోటయ్య, రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, మాజీ జడ్పీటీసీ వరగాని పౌలు తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: పసుపుగల్లులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

చేపల చెరువు ఆదాయం.. గ్రామాభివృద్ధికి వినియోగించాలి

- డీఎల్‌పీవో ఆర్.పద్మావతి

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలని డీఎల్‌పీవో ఆర్.పద్మావతి అన్నారు. మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని చింతలపూడి పరిధిలో సర్వే నెంబరు 236లో ఉన్న 78.84 ఎకరాల్లో మూడు సంవత్సరాల పాటు చేపలు పట్టుకొనేందుకు వేలంపాట నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్ వరగాని బాలసుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 13 మంది పాటలో పాల్గొన్నారు. వేములబండ గ్రామానికి చెందిన కంచుమాటి శ్రీనివాసరావు రూ.28.10 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో పద్మావతి మాట్లాడుతూ చేపల చెరువు ద్వారా వచ్చే ఆదాయం గ్రామ అభివృద్ధిలో భాగంగా వీధి లైట్లు, తాగు నీరు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులకు వినియోగించు కోవాలన్నారు. నిధులను దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పి.మౌలాలి, కె.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, చింతా శ్రీనివాస రెడ్డి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, కాటూరి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర అగ్రహారంలో..

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం చేపల చెరువు సర్వే నెంబరు 207లో మూడు సంవత్సరాల పాటు 83.90 ఎకరాల్లో చేపలు పట్టుకొనేందుకు శుక్రవారం సర్పంచ్ వేముల పద్మావతి అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో 20 మంది పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి, అద్దంకి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న దిద్యాల సుధాకరరెడ్డి రూ.17.50 లక్షలకు పాట పాడి చెరువును దక్కించుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ వేలం పాటలో పాల్గొనటానికి అనర్హులని తెలిసినా కూడా డీఎల్‌పీవో పద్మావతి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో జనార్దన్, పంచాయతీ కార్యదర్శి మౌలాలి చోద్యం చూశారు. తీరా పాట అయిపోయి తరువాత ప్రభుత్వ ఉద్యోగి పాటలో ఎలా పాల్గొంటాడంటూ నాలిక కరుచుకున్నారు. పాట రద్దు చేయాలా, సుధాకరరెడ్డికే ఉంచాలా అంటూ అధికారులు తర్జనలు భర్జనలు పడుతున్నారు. నిబంధనలు ఆర్టీసీ డ్రైవర్‌కు వర్తిస్తాయో లేదో చూడాల్సి ఉంది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల పద్మా జానకిరామయ్య, ఉపసర్పంచ్ వేముల శ్రీనివాసులు, దేవినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వర అగ్రహారం చేపల చెరువుకు వేలం పాట నిర్వహిస్తున్న డీఎల్‌పీవో పద్మావతి, ఎంపీడీవో జనార్దన్

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



దర్శిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ తదితరులు

దర్శి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మల ఆధ్వర్యంలో శుక్రవారం దర్శిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పెనుభారం మోపుతున్నారని విమర్శించారు. తొలుత దర్శి గడియార స్తంభం సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభించాలని భావించినప్పటికీ పోలీసులు అనుమతి ఇవ్వకపోవటతో వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సీఐ రామారావు, ఎస్సై మురళీలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం

కనిగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని చర్చి సెంటరు నుంచి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచేదే లేదని వాగ్దానం చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలకే చార్జీల మోత మోగించారన్నారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ చైర్మన్ గఫార్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, నాయకులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి, సాల్మన్‌రాజు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ డీఈకి వినతిపత్రం అందజేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ

పామూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మ ఫంక్షన్‌హాల్ జరిగిన సమావేశానికి పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అధ్యక్షత వహించారు. బాజీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ రవిశంకర్, జిల్లా కార్యదర్శి నరాల శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వెంకట్, పార్టీ పామూరు, కనిగిరి మండలాల అధ్యక్షులు జె.చినసుబ్బయ్య, పి.హరికృష్ణ రూరల్ అధ్యక్షుడు జి.సుబ్బారావు, అనిల్, అవినాష్, యు.శ్రీను, ఎం.గోమ్స్ నారాయణరెడ్డి నవీన్, విజయకుమార్, శివకృష్ణ, చరణ్, సతీష్, పటాన్ అంజాద్, పవన్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలూరులో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేస్తున్నారు. గత 15 రోజుల నుంచి గ్రామంలో చికెన్ గున్యా, జ్వరాలతో ప్రజలు మంచం పట్టారు. ఈక్రమంలో ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురు, శుక్రవారాల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పలు వీధుల్లో మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. బ్లీచింగ్, ఎబేట్ చల్లారు. ఒకపక్క వైద్య శిబిరాలు, మరోపక్క పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రె శ్రీదేవి రాముడు, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్‌రెడ్డి దగ్గర నుంచి పనులు చేయిస్తున్నారు.

విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ అదనపు భారాలను ప్రభుత్వమే భరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ భారాలు ఉండవని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరునెలలు గడవక ముందే విద్యుత్ భారాలు వేయడం దారుణంగా ఉందన్నారు. ఈ భారాలు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఇప్పుడు అధికారంలో ఉండేది వైసీపీనా, టీడీపీ కూటమినా అని ప్రశ్నించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో సుమారు రూ.25వేల కోట్ల భారాలు వేయడం తగదన్నారు. జగన్ తప్పు చేశారు కాబట్టే ప్రజలు ఇంటికి పంపారని, అదే తప్పును తాము చేస్తామని చెప్పడం తగదని ప్రశ్నించారు. అదాని విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించకుండా నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, ఆర్.వెంకట్రావు, కె.వీరారెడ్డి, నల్లూరి మురళి, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. కరోనా సమయంలో విస్తృతంగా వైద్యసేవలు అందించిన మగ ఆరోగ్యకార్యకర్తలను రెగ్యులర్ చేయకపోగా కోర్టు పేరుతో ఉద్యోగం నుంచి తొలగించడం దుర్మార్గంగా ఉందని విమర్శించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్నిమరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.సురేష్, శ్రీధర్‌బాబు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిని గుర్తించి రికవరీ చేయాలి

- ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్
- గుట్టు చప్పుడుగా సోషల్ ఆడిట్ నిర్వహణ

కనిగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని గుర్తించి నిధుల రికవరీ చేపట్టాలని నరేగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై స్థానిక స్త్రీశక్తి భవనంలో సామాజిక తనిఖీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీ జోసఫ్‌కుమార్ కనిగిరి మండలంలో 16వ విడత కింద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జరిగిన తనిఖీలో భాగంగా 785 వర్కులకు సంబంధించి రూ.9.36 కోట్లతో పనులు నిర్వహించినట్టు తెలిపారు. పంచాయతీరాజ్ కింద 69 వర్కుల కింద రూ.2.73 కోట్లతో పనులు చేపట్టినట్టు లెక్కలు తేల్చినట్టు పరిశీలించారు. రూ.14.36 లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి ఆయా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో కనిగిరి అసిస్టెంట్ ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన విచారణలో రూ.1.19 లక్షలు, ఎంపీడీవో పరిధిలో 2.63లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ఆయా నిధులను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో కుంటలు పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి పనులే చేపట్టకుండా రికార్డుల్లో నమోదు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగులేరు గ్రామంలో జరిగిన పనుల్లో భారీ స్థాయిలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పునుగోడు గ్రామంలో జాబ్ కార్డుల పేరుతో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నిర్దేశిత కాలవ్యవధిలో రికవరీ చేయాలని పీడీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

అయితే, సామాజిక తనిఖీ నిర్వహణ విషయం గ్రామస్థులకు తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కుబడిగా రికవరీ చేశారని, లోతుగా తనిఖీ నిర్వహిస్తే కోట్లాది రూపాయలు గోల్‌మాల్ వ్యవహారం బయటపడుతుందని చర్చ సాగుతుంది.



సామాజిక తనిఖీలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్

కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో హనుమంతరావు, ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.





2023 మ్యుటేషన్ ఆమోదించినట్టు, ఒకే పేరుతో ఒక ఖాతాలో పలు సర్వే నంబర్లతో భూ హక్కులు మార్చేసిన చిత్రం



భూ మాయ.. ఒకటి రెండు కాదు.. రూ.కోట్లు విలువైన 223.37 ఎకరాలను రాసేశారు. అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూమి హక్కుదారులు ఐదుగురే. ఐదుగురి పేర్లపైకి మార్చేసిన ఈ భూమి మొత్తం పొన్నూరు అర్బన్ పరిధిలోది కావడం భూ యజమానులను కలవరపరుస్తోన్నది. 60 నుంచి 70కిపైగా సర్వే నంబర్లలోని అర సెంటు నుంచి ఎకరాలకు ఎకరాలు భూమిని కేవలం ఐదుగురు పేరుపై మార్చేశారు. వారి పేర్లు కూడా గందరగోళమే. అసలు వారెవ్వరు.. వారున్నారా అంటే అనుమానమే. కొందరు భూ యజమానుల పరిశీలనలో వెలుగుచూసిన ఈ భూమాయ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా మ్యుటేషన్లు జరగడం చూస్తే ఇందులో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు ఖాతాలను ఎప్పుడు మ్యుటేషన్ చేశారనేది చూపకున్నా, మిగిలిన మూడు ఖాతాలను 2023, 2024 సంవత్సరాల్లోనే మ్యుటేషన్ చేశారు. దీనిని బట్టి ఏదైనా భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారా అనే అనుమానాలు వస్తున్నాయి.

ఐదుగురికి.. రూ. 1000 కోట్ల భూములు

- 70కిపైగా సర్వే నంబర్లు.. 223 ఎకరాలు
- పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ
- 2023, 2024లో మూడు ఖాతాల మ్యుటేషన్
- గత వైసీపీ హయాంలో భారీ భూ కుంభకోణం
- పేరు మార్చి అమ్మేశారా.. తాకట్టు పెట్టి కోట్లు దోచేశారా?

తెనాలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు... రెండు కాదు... అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూములవి. మొత్తం 223.37 ఎకరాలను భూములకు ఐదుగురిని హక్కుదారులను చేసేశారు. పేరు మారిన భూములు క్రయవిక్రయాల ద్వారా చేతులు మారాయా? లేక మరేదైనా కుంభకోణానికి ఉపయోగించుకున్నారా! అనేది అంతుబట్టని విషయం. వైసీపీ నేతల్లో ఎవరైనా పావులు కదిపి తమకు తెలిసిన వ్యక్తుల పేర్లపై భూములను మార్పిడి చేయించి, వాటిని అమ్మేశారా? లేక తాకట్టుపెట్టి రూ.కోట్లు దోచేశారా! అనే సందేహాలకూ సమాధానం దొరకని పరిస్థితి. ఇంతటి భారీ భూ మాయపై అధికారులే గుట్టు విప్పాల్సి ఉంది. రెవెన్యూ ఖాతా ఒకటే దానిలో ఉన్న సర్వే నంబర్లు మాత్రం 70కిపైనే. భూములు కూడా ఒక్కొక్కరి పేరుపై 50 ఎకరాలకుపైనే కట్టబెట్టారు. ఇది ఏ పల్లెటూరులోనో, మారుమూల గ్రామాలకు సంబంధించినదైతే పర్వాలేదు. పొన్నూరు పట్టణ పరిధిలోని భూములు కావడం, వాటి విలువ లెక్కిస్తేనే కళ్లు తిరిగే పరిస్థితి. ఒకరి పేరుపై 60 ఎకరాలుంటే, దానిలో ఎకరాకు మంచిన భూమి 10 నుంచి 20 ఎకరాల వరకే ఉంది. మిగిలిన సర్వే నంబర్లలోనివన్నీ సెంట్లు, గజాల లెక్కనే ఉన్నాయి. అంటే పట్టణంలో సెంటు భూమి కనీసం రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. అంటే పది సెంట్ల భూమి ఉందంటే అతను కోటీశ్వరుడి కింద లెక్కే. ఇంతటి విలువైన భూములు కేవలం ఐదుగురు వ్యక్తుల పేర్లపై మార్చడం ఆందోళన కలిగిస్తున్న అంశం. 5001 నుంచి 5005 వరకు ఖాతా నంబర్లను పూర్తిగా ఐదుగురు వ్యక్తులకు కేటాయించారు. ఒకవేళ ఆ ఖాతాలో ఏదో ఒక సర్వే నంబర్‌కు సంబంధించిన హక్కుదారుడి పేరు ఉంటుందనుకున్నా, ఒకరిపేరుపైనే అంత భూమిని ఎక్కించకూడదు. కానీ ఇక్కడ ఎకరాలకు ఎకరాలు అప్పనంగా మార్చేశారు. పట్టణంలో పది సెంట్ల భూమి రూ.2 కోట్లకుపైగా ఉంటే, పట్టణ శివార్లలో ఉన్న పొలం కూడా ఎకరా రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రకారం లెక్కించినా 223 ఎకరాల భూమి విలువ రూ.వెయ్యికోట్లపైనే ఉంటుందనేది ఒక అంచనా.

భూ కుంభకోణమనేందుకు అనుమానాలు..

- వరుస ఖాతా నంబర్లలో వందల ఎకరాల భూమి పేర్లు మారిపోవడం చూస్తే పొరపాటు కాదనేది అర్థమవుతున్నది.
- ఐదుగురు వ్యక్తులను ఎంపిక చేసుకుని వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలుకానీ, ఇతర నేతలెవరయినా భారీగా రుణ కుంభకోణానికి పాల్పడి

(మిగతా 6వ పేజీలో..)

వారెవరు.. అదెలా సాధ్యం ?

- పొన్నూరు అర్బన్ పరిధిలో 5001, 5002, 5003, 5004, 5005 ఖాతా నంబర్ల కింద ఐదుగురు పేర్లు ప్రస్తావించారు.
- 5001 ఖాతా నంబరులో పట్టాదారుడి పేరుగా అమరావతి లోకనందం అని తండ్రి లేదా భర్త పేరు అమరావతి అని ఉంది. ఇక్కడ ఆ వ్యక్తి ఇంటి పేరు తండ్రి లేదా భర్త పేరు ఒకటిగానే చూపారు. ఈ ఖాతాలో ఆ పేరున 72 సర్వే నంబర్లు చూపి, 45.7641 ఎకరాల భూమికి హక్కుదారుడిగా చూపారు. వీటి మ్యుటేషన్ 2023 ఆగస్టు 5న ఆమోదించినట్లు చూపారు. 326 సర్వే నంబరులో 5.59 ఎకరాలు, 250-6 సర్వే నంబరులో 2.89 ఎకరాలు చూపారు.
- 5002లో పట్టాదారుగా వెలగపూడి నారాయణగౌడ్ అని ఉంది. ఖాతాలో 76 సర్వే నంబర్లు కేటాయించి 61.1325 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. 221-1బీలో మెట్ట భూమి 25 ఎకరాలున్నట్లుచూపారు.
- 5003 ఖాతాలో నిడుబ్రోలు సితార, భర్త నిడుబ్రోలు పేరుతో 77 సర్వే నంబర్లు నమోదై ఉన్నాయి. 42.285 ఎకరాల భూమిపై సితారకు హక్కు చూపారు. 154-5 సర్వే నంబరులోని 12 సెంట్ల భూమికి సంబంధించి మ్యుటేషన్ 2024 మార్చి 12న ఆమోదించినట్లు చూపారు. మిగిలిన నంబర్ల మ్యుటేషన్ ఆమోదించిన కాలమ్‌ను ఖాళీగా వదిలేశారు.
- 5004 ఖాతా నంబరులో గుంటూరు స్వేహారెడ్డి, భర్త గుంటూరు పేరుతో 68 సర్వే నంబర్ల కింద 35.5775 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. ఈ ఖాతాకు సంబంధించి భూమి ఎలా సంక్రమించిందనే కాలం, మ్యుటేషన్ కాలమ్‌లను ఖాళీగా వదిలేశారు.
- 5005 ఖాతా నంబరులో అమరావతి నవనీతం, భర్త అమరావతి పేరుతో 76 సర్వే నంబర్లు కేటాయించారు. వీటిలో మొత్తం 38.6162 ఎకరాల భూమి సంక్రమించినట్లు ఉంది. ఈ ఖాతాకు సంబంధించి అన్ని సర్వే నంబర్లు 2024 అక్టోబరు 19 తేదీతో మ్యుటేషన్ ఆమోదించినట్లు చూపారు.

హక్కుదారులొస్తే మారుస్తారంట

2023లో మ్యుటేషన్ అయినట్లు రికార్డుల్లో చూపిస్తుంది. అయితే అవన్నీ 2016లోనే జరిగినట్లు అధికారులు బుకాయిస్తున్నారు. మరో అడుగు ముందుకువేసి... అవన్నీ నోషనల్ ఖాతాలని, హక్కుదారులు అందుబాటులో లేకపోయినా, ఎవరైనా కచ్చితమైన డాక్యుమెంట్లు చూపకపోయినా అటువంటి ఖాతాల్లోకి మార్చుతామని, హక్కుదారులు వచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మార్చుతున్నామని చెప్పుకొస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ మార్పులు

ఎన్నికలు పూర్తయి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మ్యూటేషన్‌లో మార్పులు జరిగాయి. ఎక్కువ శాతం భూమి 2023 సంవత్సరంలో మారింది. కొన్ని ఈ సంవత్సరం మే, అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా ఆమోదించినట్లు నమోదు చేశారు. దీనినిబట్టి ఎవరైనా బలమైన వ్యక్తుల ప్రమేయం ఉందా అనేది అంతుబట్టని విషయం. అయితే ఈ ఐదు ఖాతా నంబర్లలో పట్టాదారులుగా చూపిన ఐదుగురు ఎవరనేది తేలాల్సి ఉంది.

- ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీలు
- జీ-2 లైసెన్స్ లేకుండా తయారీ
- గుంటూరు-శివారు గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వినుకొండ అడ్రస్‌తో రైతులకు అంటగడుతున్న బిల్లులు

నకిలీ బయోలు

గుంటూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీల పేరుతో.. వారు కూడా గుర్తించనట్లుగా పురుగు మందులు, బయో ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. నకిలీ బయో మందులు, పురుగు మందుల అమ్మకాలు గుంటూరులో జోరుగా సాగుతున్నాయి. నకిలీ పురుగు మందులు, బయో ఉత్పత్తులు రైతులను నిండా ముంచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. జీ-2 అనుమతి కూడా లేకుండానే బయో ఉత్పత్తుల తయారీ.. అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ మధ్య కాలంలో కొందరు రైతులు బయో ఉత్పత్తులు, పురుగు మందుల కోసం గుంటూరు రూరల్ మండలం ఓబుల్‌నాయుడుపాలెం, యనమదల, నాయుడుపేటలోని జగనన్న కాలనీకి పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఆరా తీస్తే పల్నాడు జిల్లా వినుకొండ అడ్రస్‌తో హిమాలయ అగ్రిటెక్ పేరుతో బిల్లులు ముద్రించి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. వినుకొండ ప్రాంతానికి చెందిన నకిలీ బయోల మాఫియా నాలుగు నెలలుగా గుంటూరు రూరల్ మండలంలో మకాం వేసి నకిలీ బయోలు అమ్ముతున్నట్లు తెలిసింది. వారు రైతులకు ఇస్తున్న బిల్లుల ఆధారంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. ఆ పేరుతో బయో ఉత్పత్తుల అమ్మకాలకు అవసరమైన జీ-2 అనుమతి లేదని తెలుస్తోంది. కేవలం రైతులను నమ్మించేందుకు బిల్లులు తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

తక్కువ ధరని రైతులకు గాలం..

గతంలో ప్రముఖ పురుగు మందుల కంపెనీల్లో పనిచేసిన కొందరు వ్యక్తులను ఉద్యోగులుగా చేర్చుకుని గుంటూరు శివారులో నకిలీ బయోల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తుంది. తక్కువ ధరకే మంచి పురుగు మందులు లభ్యం అవుతున్నాయని చెప్పి రైతులను ఆకర్షిస్తున్నారు. రైతులు ఆయా ప్రాంతాల నుంచి గుంటూరు మార్కెట్ సెంటర్‌కి వస్తే నకిలీ కంపెనీకి చెందిన వ్యక్తులే ఆటోలు ఏర్పాటు చేసి వ్యాపార స్థావరానికి తీసుకుపోతున్నారు. రోజుకు 70 నుంచి 80 మంది రైతులను ఈ విధంగా తీసుకువచ్చి నకిలీ మందులు అంటగడుతున్నారు. ఈ విధంగా రోజుకు రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల వరకు నకిలీ బయోలు, పురుగు మందులు అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే వ్యక్తులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ మందులను విక్రయిస్తున్నారు. గోద్రెజ్ కంపెనీకి చెందిన గ్రాసియా పురుగుమందు పేరుతో నకిలీలను రైతులకు అంటగడుతున్నారు. బీఎస్ఎఫ్‌కు చెందిన ఎక్సోనస్, బేయర్ కంపెనీకి చెందిన కొన్ని పురుగు మందులను కూడా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రైతులు తక్కువ ధరకు వస్తున్నాయని ఆయా మందులను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవి పని చేయకపోవడంతో రైతులు వచ్చి ఘర్షణలు పడి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో నగదు వెనక్కి ఇచ్చినట్లు తెలుస్తోంది.

తెలంగాణ నుంచి తెచ్చి..

తెలంగాణ నుంచి ముడి పదార్థాలను తీసుకువచ్చి బయో ఉత్పత్తులను తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదే వ్యక్తులు అటు పల్నాడులోనూ గతంలో ఇదే రీతిలో నకిలీ మందులు భారీగా విక్రయించినట్లు తెలుస్తోంది. ఇటీవల అక్కడ దొరికిన నకిలీ బయోల డంప్ వ్యవహారంతో గుంటూరు ముఠాకు సంబంధాలు ఉన్నట్లు సమాచారం. అక్కడ దాడులు జరగడంతో ఇక్కడకు మకాం మార్చినట్లు ప్రచారం జరుగుతోంది.



పురుగు మందుల కంపెనీ పేరుతో ముద్రించిన నకిలీ ప్యాక్

ఎవరీ 'బాలు'

గుంటూరు శివారు గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా నకిలీ బయో ఉత్పత్తులు అమ్మకాలు జరుపుతున్న వ్యవహారంలో బాలు అనే వ్యక్తి కీలకంగా ఉన్నట్లు సమాచారం. రైతులను అక్కడకు తీసుకెళ్లే మధ్యవర్తులు ఆ పేరునే ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే సదరు వ్యక్తులు రైతులకు ఇస్తున్న బిల్లు మీద యజమాని స్థానంలో ఎవరి పేరు లేదు.

నిఘా ఉంచాం.. ఎవర్నీ వదలం

నకిలీ బయో ఉత్పత్తులకు ఎటువంటి అనుమతి లేకుండా కొందరు గుంటూరు శివారు గ్రామాల్లో విక్రయిస్తున్నారన్న వ్యవహారంపై నిఘా ఉంచాం. ఆయా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. నకిలీల వ్యవహారంలో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

- నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

- జనవరి పింఛన్ ఈ నెల 31నే పంపిణీ
- 30న బ్యాంకుల నుంచి నగదు డ్రాకు ఆదేశాలు
- యలమందలలో పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు

మూడో నెలా.. ముందస్తుగానే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రతీ నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రతీ నెల రికార్డులను అధిగమిస్తోంది. ఈ క్రమంలో ఒకటో తేదీ సెలవు దినమైతే ఆ తర్వాత రోజు కాకుండా ముందు రోజే పింఛన్ల నగదు అందజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తి అయి ఏడో నెల సమీపిస్తున్నది. అయితే ఇప్పటికి ఆరు నెలలు కూటమి ప్రభుత్వ నేతృత్వంలో పింఛన్లు పంపిణీ జరగ్గా జనవరి ఏడో నెల అవుతుంది. ఈ క్రమంలో ఒకటో తేదీ కంటే ముందుగానే ఇప్పటికి మూడు నెలలు పింఛన్ల పంపిణీ జరిగింది. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఆగస్టు 31న, డిసెంబరు 1 ఆదివారం కావడంతో నవంబరు 30న పింఛన్ల పంపిణీ జరిగింది. కొత్త సంవత్సరం జనవరి 1 కావడంతో ఒక రోజు ముందు డిసెంబరు 31నే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ 31న చేయాలంటే ఒక రోజు ముందుగానే పంచాయతీలు, మున్సిపాల్టీల వారీగా నగదును బ్యాంకుల నుంచి డ్రా చేయాలి. ఈ ప్రక్రియను ఈ సారి 30న చేపట్టనున్నారు. 31న మంగళవారం పింఛన్లు పంపిణీకి అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

95 శాతానికి పైగానే పంపిణీ..

వలంటీర్లు లేకుండా ఇంటింటా పింఛన్ పంపిణీ సాధ్యం కాదనే గత వైసీపీ ప్రభుత్వ వాదనను కూటమి ప్రభుత్వం అధిగమించింది. అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బందితోనే ప్రతీ నెల ఒక్క రోజులోనే 95 శాతానికిపైగా పింఛన్లను అందించగలిగింది. పల్నాడు జిల్లాలో 2,74,209 మంది పింఛన్‌దారులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో 2,28,615, గుంటూరు జిల్లాలో 2,54,610 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఈ నెలలో పల్నాడు జిల్లాలో 2,71,190(98.9 శాతం) మంది లబ్ధిదారులకు రూ.116,02,90,000, బాపట్ల జిల్లాలో 2,25,788(98.76 శాతం) మందికి రూ.94,28,68,00, గుంటూరు జిల్లాలో 2,51,900(98.94 శాతం) మందికి రూ.107,59,32,00 పంపిణీ చేశారు.

ఏర్పాట్లలో అధికారులు..

ప్రతి నెలా రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి పింఛన్ల పంపిణీని నరసరావుపేట నియోజకవర్గంలోని యలమందలలో చేపట్టనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలిప్యాడ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఆయా పనులను శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.



యలమందలలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్

నిరాదరణ కారణంగా శబరిమల ప్రత్యేక రైళ్ల రద్దు

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నిరాదరణ కారణంగా జనవరి నెలలో పలు శబరిమల ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 24న నంబరు. 07167 మౌలాలి-కొట్టాయం, 25న నం. 07168 కొట్టాయం-మౌలాలి, 07171 మౌలాలి-కొట్టాయం, 26న నం.07169 కాచీగూడ-కొట్టాయం, 27న నం.07172 కొల్లం-మౌలాలి, నం.07170 కొట్టాయం-కాచీగూడ, 07157 నరసపూర్-కొల్లం, 28న నం.07065 హైదరాబాద్-కొట్టాయం, 29న నం.07158 కొల్లం-నరసపూర్, నం.07066 కొట్టాయం-సికింద్రాబాద్, 31న నం.07167 మౌలాలి - కొట్టాయం, ఫిబ్రవరి 1న నంబరు. 07168 కొట్టాయం-మౌలాలి రైళ్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని యాత్రీకులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

మార్చి నెలాఖరు వరకు పలు ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైళ్ల సేవలను మార్చి నెలాఖరు వరకు పొడిగించినట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్-రామనాథపురం-సికింద్రాబాద్, నాందేడ్-ఈరోడ్-నాందేడ్, కాచీగూడ-నాగర్‌కోయిల్-కాచీగూడ, కాకినాడటౌన్-లింగంపల్లి-కాకినాడ(ట్రైవీక్లీ), హైదరాబాద్-కటక్-హైదరాబాద్ ప్రత్యేకరైళ్లను మార్చివరకు పొడిగించారు.

9 పోస్టులు.. 90 దరఖాస్తులు

- మహిళా శిశు సంక్షేమశాఖలో భర్తీకి ఇంటర్వ్యూలు

బాపట్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమశాఖలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా ఎంపిక కమిటీ చైర్మన్ కలెక్టర్ జె.వెంకటమురళి అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరయ్యారు. వన్‌స్టాప్ సెంటర్‌లో నాలుగు పోస్టులకు, డీసీపీయూలో రెండు పోస్టులకు, బాలసదన్‌లో మూడు పోస్టులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం తొమ్మిది ఉద్యోగాలకు 90 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్పీ తుషార్‌డూడీ, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమతో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



మహిళా శిశు సంక్షేమశాఖలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

వర్సిటీ ఉద్యోగికి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కోప్ ఫౌండేషన్ ద్వారా సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ వీసీ చాంబర్లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం చేతుల మీదుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను డాక్టర్ కొండలరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రజల మధ్య సేవ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా నిరంతరం వారి అభ్యున్నతికి కృషి చేయడం అభినందించాల్సిన విషయం అన్నారు. కొండలరావు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం యూనివర్సిటీకి గర్వకారణం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ కొండలరావు సేవలను స్ఫూర్తిని తీసుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మజీరావు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద్, వై.రాధాకృష్ణ, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రత్తయ్య, కోశాధికారి రాజకుమార్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో కార్పొరేట్ తరహా శిక్షణ

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్స్ పొందేందుకు కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్ రెడ్డి సెమినార్ హాల్‌లో ఇంజనీరింగ్ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్స్‌పై కోడ్ తంత్ర సంస్థ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ సీఆర్‌టీని వినియోగించుకొని విద్యార్థులు రాబోయే ప్రాంగణ ఎంపికల్లో మరిన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించాలని కోరారు. గౌరవ అతిథి విట్ కళాశాల డీన్ ప్రొఫెసర్ కుమార్ స్వామి మెటవర్స్ టెక్నాలజీ (వర్చువల్ వర్డ్), క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఓఎస్‌డి ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్ మాట్లాడుతూ పైథాన్ లాంగ్వేజ్ విశిష్టతను, వాటి అప్లికేషన్స్‌ను తెలిపారు. కోడ్ తంత్ర జోనల్ హెడ్ బి. చంద్రశేఖర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

వర్షార్పణం

నిండా మునిగిన మినుము రైతు

ఆదుకోవాలని వేడుకోలు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



వర్షాలకు ఉబ్బిన మినుము గింజలు

పామూరు, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు మినుము రైతు నిండా మునిగాడు. కోత దశలో ఉన్న మినుము పంటను ఇంటికి తెచ్చుకొందాం అనుకొం టున్న తరుణంలో వరుణుడు కోలుకోలేని దెబ్బతీశాడు. పామూరు మండలంలో 888 హెక్టార్లు, సీఎస్‌పురం మం డలంలో 580 హెక్టార్లలో మినుము సాగు చేశారు. ఎకరాకు రూ.15 వేల వరకు రైతులు ఖర్చు పెట్టారు. మా ర్కెట్‌లో కింటా రూ.7 వేలు ధర పలుకుతుండటంతో మంచి లాభం వస్తుందనుకుంటున్న తరుణంలో అకాల వర్షం దెబ్బతీసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి, గుమ్మలం పాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, మోపాడు, లక్ష్మీన రసాపురం, కరోళ్లపాడు, ఇనిమెర్ల, నుచ్చుపొద, చిలం కూరు. దూబగుంటతో పాటు సీఎస్‌పురం మండలంలోని పెద గోకులపల్లి, వెంగనకుంట, కె.అగ్రహారం, సి.నాగు లారం తదితర గ్రామాల్లో మినుము సాగు చేశారు. కొన్ని గ్రామాల్లో మినుము కోతలు కోసి ఓదేలు వేశారు. గురు వారం రాత్రి కురిసిన అధిక వర్షానికి మినుము పంట ఎందుకు పనికి రాకుండా పోయింది. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారంపై నివేదిక

పామూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కురిసిన ముసురు వా నతో పాటు గురువారం రాత్రి కురి సిన భారీ వర్షానికి మినుము పం ట దెబ్బతిందని జిల్లా వ్యవసాయా ధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రావిగుంటపల్లి, వ గ్గంపల్లి తదితర గ్రామాల్లో వర్షాల కు దెబ్బతిన్న మిను ము పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. కోతలు కోసి ఓదేలుపై ఉన్న తరు ణంలో వర్షం కురవడంతో పంట కుళ్లిపోయి బూజుపట్టి దెబ్బతిందన్నారు. త్వరలో పంట నష్టంపై సర్వే చేయించి పరిహా రం కోసం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కాగా వగ్గంపల్లి గ్రామంలో పలువురు రైతులకు 80 శాతం రాయితీ కింద కాక్ 2 రకం తెల్ల శనగలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రమణ, ఏవో రాధ పాల్గొన్నారు.

నష్టం అంచనాలు తయారుచేయాలి

పీసీపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టానికి సంబంధించి అంచనాలు తయారుచేయాలని కనిగిరి ఏడీఏ రమణ, పీసీపల్లి వ్యవసాయ అధికారి ప్రకాశరావును జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాస రావు ఆదేశించారు. వెంగళాయపల్లి గ్రామంలో దెబ్బతి న్న మినుము, ఇతర పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22వేల ఎ కరాలలో మినుము సాగుచేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము కొన్ని ప్రాంతాలలో దెబ్బతిందని చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలను అంచనా త యారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అకాల వ ర్షాలకు సాగుచేసిన కంది, మినుము, మిరప తదితర పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని వెంగళాయపల్లి స ర్పంచ్ కరణం తిరపతయ్య పేర్కొన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. పంటలు సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తించేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారికి విన్నవించారు. ఈసందర్భంగా మండలంలో రైతులు సాగుచేసిన పంటల వివరాలు, వాటి విస్తీర్ణం, దెబ్బతిన్న పంటల విస్తీర్ణం వివరాలను అంచనావేసి తనకు నివేదించాలని ఏడీఏ, ఏవోలను శ్రీనివాసరావు ఆదేశించారు.

బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం

సమస్యలపై ప్రశ్నించిన వైసీపీ కౌన్సిలర్లు



హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, డిసెంబరు27(ఆంధ్ర జ్యోతి): బడ్జెట్ అంచనాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం 2024-25 రివైజ్డ్ బడ్జెట్, 2025-26 బడ్జెట్ అంచనాలు ప్రతిపాదించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్‌పర్సన్ తో పాటు మెజార్టీ కౌన్సిలర్ లు వైసీపీ తరఫునే ఉన్నప్పటికీ నిర్ణయాలను మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించాల్సింది పోయి వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించటం పలువురిని విస్మయానికి గురిచేసింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్‌వో ప్లాంట్ లలో 20 లీటర్ల నీరు 2 రూపాయల నుంచి 5 రూపాయలకు పెంచటం పట్ల 1, 20 వార్డుల కౌన్సిలర్లు బాలు, కోటేశ్వరరావులు ప్రశ్నించారు. దీనికి స్పందించిన కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, 2 రూపాయలకు మించి వసూలు చేయవద్దని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలోనే చెప్పారని వివరించారు. అనంతరం 16 వ వార్డు కౌన్సిలర్ రమణ మాట్లాడుతూ భవానీ సెంటర్‌లోని రీడింగ్ రూమ్ స్థలాన్ని కొందరు స్వార్థానికి వినియోగించుకునేందుకు చూస్తున్నారని, అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో టీడీపీ కౌన్సిలర్‌లు సమస్యలపై ప్రశ్నించగా శుక్రవారం సమావేశం మాత్రం అందుకు భిన్నంగా వైసీపీ కౌన్సిలర్‌లు ప్రశ్నించటం చర్చనీయాంశంగా మారింది. వైస్ చైర్మన్‌లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సంతరావూరు అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా

చినగంజాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : తానెక్కడున్నా సంతరావూరు గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో మాజీ జడ్పీ సీఈవో జంగం రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగిన ఆత్మీయ సత్కారసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభలో ఎంపీ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనకిందించిన ఆదరణను ఎప్పటికీ మరువనన్నారు. ముఖ్యంగా యువత స్వయంకృషితో ఎదగాలని, తమ భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. సంతరావూరు గ్రామ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆత్మీయ సత్కార సభలో ప్రసాదరావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ప్రసాదరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితో ఆధునిక యువతీ యువకులు తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రసాదరావుకు గ్రామస్థులు పౌర సన్మానం చేసి ఆయనపై తమకున్న అనుబంధాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా ఎంపీ ప్రసాదరావుకు తన చిన్ననాటి స్నేహితుడు, మాజీ జడ్పీ సీఈవో రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త దేవతోటి నాగరాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరరావు, గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు పుష్పాలు, బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. ప్రాచీన సంప్రదాయాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ జట్కా బండిపై ఎంపీని గ్రామవీధులలో ఊరేగించారు. ఈ సత్కార కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, తేళ్ల అరుణ, టీడీపీ మండలం అధ్యక్షుడు పొద వీరయ్య, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగం ప్రవీణ్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగరాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవరపల్లి రాజేష్, నాయుడమ్మ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పార్వతి



చీరాలలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) :ప్రజలు తమ సమస్యలకు సంబంధించి ఇచ్చే అర్జీలను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. మండల పరిధిలోని అక్కాయిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే రెవెన్యూ సేవలు

చినగంజాం : రెవెన్యూ సేవలు ప్రజల చెంతకు చేర్చేందుకే సదస్సులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని టీడీపీ సీనియర్ నాయకురాలు, మాజీ జడ్పీటీసీ యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో రైతులు, ప్రజల నుంచి వివిధ సమస్యలపై 93 అర్జీలను స్వీకరించారు. మ్యూటేషన్ కోసం 8, ఎఫ్‌లైన్ కోసం 81, పేరు సరిచేయుటకు ఒకటి, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం 3 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవతోటి నాగరాజు, కేశనపల్లి శ్యాంబాబు, మండల సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ నాగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



చినగంజాంలో సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్ ప్రభాకర్‌రావు

రెవెన్యూ సదస్సులో 64 దరఖాస్తులు

మార్టూరు :మార్టూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజలనుంచి 64 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు టి.ప్రశాంతి తెలిపారు. వాటిలో పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం 21, భూముల సర్వే కోసం 39 , 22 ఎ కోసం 3, ఎండోమెంట్ సమస్యపై 1 దరఖాస్తు వచ్చాయన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రహమాన్ బాషా, మండల సర్వేయరు పి. ఏడుకొండలు, దేవాదాయ ఈవో శిరీష,తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : రెవెన్యూ సదస్సులలో ఎన్నో ఎళ్ల నుంచి భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రత్యేకాధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో తహసీల్దార్ రవినాయక్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి అందరికీ న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఆర్‌ఐ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి.. రూ.వెయ్యి కోట్ల భూములు

● పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ

(5వ పేజీ తరువాయి..)

ఉంటారా అనేది తెలియాలి.

● అధికారులు చెబుతున్నట్లు నోషనల్ ఖాతా అంటే దానిలో ఉన్న 70కిపైగా సర్వే నంబర్లలో పట్టాదారుడి పేరు ఒకరిదే ఉండకూడదు. ఇక్కడ ఒక ఖాతాకు ఒకరి పేరే అన్ని సర్వే నంబర్లకూ ఉండటం కుంభకోణానికి పాల్పడ్డారనే అనుమానాలకు బలం చేకూర్చుతుంది.

● తాత్కాలిక ఖాతా అయినా, శాశ్వత ఖాతా అయినా, దానిలో ఒక పేరుపైనే అన్ని సర్వే నంబర్లు ఉండటం, పైగా వాటన్నిటినీ ఒకే తేదీతో మ్యుటేషన్ ఆమోదించడం కూడా అనుమానం కలిగిస్తున్నది.

● వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్ ద్వారా మార్పులు చెయ్యాలంటే ఖచ్చితంగా తహసీల్దారుకు తెలియకుండా జరగదు. ఒకవేళ కిందిస్థాయి సిబ్బంది మార్పులు చేశారనుకున్నా, ఒకటి, రెండు సర్వే నంబర్లు మినహా ఒకేసారి 70కిపైగా నంబర్లను మార్చలేరు. మార్చినా తహసీల్దారుకు తెలిసిపోతుంది.

● ఆ భూములను చూపించి ఎవరో పేరుతో భారీగా రుణాలు దోచేసిన పరిస్థితుల వంటివి ఏమైనా ఉన్నాయా! అనేదికూడా పరిశీలించాల్సిన అంశమే.

● విలువైన భూములను రికార్డుల్లోకి ఎక్కించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉన్నా, అధికారులు పూర్తి నిర్లక్ష్యంతోనో, లేక నేతలు చెప్పినట్లో మార్చేశారనేది వస్తున్న విమర్శ.

● ఒకవేళ పొరపాటుగా జరిగినా, అక్కడక్కడ ఖాతా నంబర్లలో పొరపాట్లు జరగడం సహజం. కానీ ఇక్కడ వరుస ఖాతా నంబర్లను చూస్తే ఉద్దేశ పూర్వకంగానే చేశారనేది సీనియర్ అధికారుల అనుమానం.

● నోషనల్ ఖాతాలంటే ఆ నంబరు ఆరు అంకెల్లో ఉంటుంది. కానీ నాలుగు అంకెల్లో ఉన్న ఖాతాలను నోషనల్ ఖాతాలని అధికారులే చెప్పడం చూస్తే ఇందులో ఏదో మతలబు ఉందని తెలుస్తోంది. నోషనల్ పేరుతో తప్పుదారి పట్టించే ప్రయత్నం కూడా అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

మామూళ్ల దోపిడీ

ఈ భూమాయ విషయంలో భూ హక్కుదారులను రెవెన్యూ సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ భూమి ఎవరి ఖాతాలోనో నమోదైందని తెలుసుకున్న యజమానులు మార్పుల కోసం అర్జీలు పెట్టుకుంటే, వారి భూమి విస్తీర్ణం, ధరను బట్టి రూ.10 లక్షల వరకు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారు అడిగినంత ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుతున్నారని బాధితులు చెబుతున్నారు. సచివాలయం ద్వారా అర్జీ పెట్టుకుంటే, దానిపై తహసీల్దారు తర్వాత స్థానంలో ఉన్న అధికారి సంతకం ఉంటే కానీ అది ఆన్‌లైన్‌లోకి రావడం లేదు. సంబంధిత అధికారిని కలిసి, ఆయన అనుమతి తీసుకొస్తే దరఖాస్తు ఆన్‌లైన్ అవుతుందని కొన్ని సచివాలయాల్లోని సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారంటే దోపిడీ ఎంత పకడ్బందీగా జరుగుతుందో అర్థమవుతుంది. ప్రధానంగా ఇద్దరు అధికారులు ఈ వ్యవహారంలో పీడించిమరీ వసూళ్లకు పాల్పడుతుంటే, బాధితులు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఇటీవల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆ అధికారులను తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. అయినా వారిలో మాత్రం మార్పు లేదని తెలుస్తోంది.

పరిశీలించి సరిచేస్తాం

ఆ ఖాతాలు 2016లో మార్పులు జరిగిపోయినవి. అప్పట్లో హక్కుదారులు రాకపోవడంతో వాటిని తాత్కాలిక ఖాతాల కింద నోషనల్ అకౌంట్‌లో నమోదు చేశాం. ఎవరైనా తమ సర్వే నంబర్లు మారాయని వస్తే, వారి పత్రాలు పరిశీలించి మార్పులు చేస్తాం. ఇందుకు ఎవరూ డబ్బులు డిమాండ్ చెయ్యరు. ఒకవేళ చేసినా ఇవ్వాల్సిన పనిలేదు. నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటా. మొత్తం ఖాతాలను పరిశీలించి, పొరపాటు ఎక్కడ జరిగిందో చూసి త్వరలోనే సరిచేస్తాం.

- జియావుల్‌హక్, తహసీల్దారు పొన్నూరు

కేజీబీవీ విద్యాలయం తనిఖీ అవీఇవీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ. డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఎంఈవో రమేష్ తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతిలో కేజీబీవీలో విద్యార్థినులకు భోజన కష్టాలు అన్న కథనం శుక్రవారం ప్రచురితం కావటంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో కేజీబీవీ విద్యాలయాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యాలయంలో వంట తయారు చేసే వారు నలుగురు ఉండగా అందరూ విధులకు గైర్హాజరు కావటంతో ఉపాధ్యాయులే భోజనం తయారు చేసి విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. ఉపాధ్యాయులు వంట చేస్తున్న విషయాన్ని అయన వారిని అడిగి తెలుసుకొన్నారు. వంట వారు రాకపోవటంతో పదిహేను రోజుల నుంచి తామే వంట చేసి పెడుతున్నామని ఉపాధ్యాయులు ఎంఈవోకు తెలిపారు. వారు తెలిపిన వివరాలను నివేదిక తయారు చేసి జిల్లా అధికారులకు రిపోర్టు పంపుతామని ఎంఈవో తెలిపారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



ర్యాలీలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఇంకొల్లు,డిసెంబరు 27,(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించినట్లయితే ప్రమాద సమయంలో ప్రాణహాని జరగకుండా కాపాడుకోవచ్చునని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. ఇంకొల్లులో శుక్రవారం రోటరీటవర్ నుంచి హెల్మెట్ ధరించడం వలన కలుగు ఉపయోగాలపై వాహనచోదకులకు అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం ఇంకొల్లు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. మండలంలో గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి స్టేషన్‌కు అనుసంధానం చేయడం పట్ల ఎస్సై సురేష్‌ను అభినందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాత్రివేళల్లో గస్తీ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ రమణయ్య,ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి



ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న చినహనిమిరెడ్డి

అద్దంకి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి అన్నారు. శింగరకొండ రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి శుక్రవారం వైసీపీ నేతలు ర్యాలీ గా విద్యుత్ కార్యాలయం వద్ద కు వెళ్లి ఈఈ మస్తాన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


చీరాల డీఈ కార్యాలయం వద్ద ఆందోళన

కొత్తపేట(చీరాల) : విద్యుత్ బిల్లుల పెంపుతో వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ చార్జీలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. అనంతరం ఈఈ జాన్‌థామస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి వినియోగించాలి

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలని డీఎల్‌పీవో ఆర్.పద్మావతి అన్నారు. మండలంలోని పసుపుగల్లు పంచాయతీ పరిధిలోని చింతలపూడి పరిధిలో సర్వే నెంబరు 236లో ఉన్న 78.84 ఎకరాల్లో మూడు సంవత్సరాల పాటు చేపలు పట్టు కొనేందుకు వేలంపాట నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్ వరగాని బాలసుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 13 మంది పాటలో పాల్గొన్నారు. వేములబండ గ్రామానికి చెందిన కంచుమాటి శ్రీనివాసరావు రూ.28.10 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పి.మౌలాలి, కె.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు ఇందూరి పిచ్చిరెడ్డి, చింతా శ్రీనివాస రెడ్డి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, కాటూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర అగ్రహారంలో..



వేలం పాట నిర్వహిస్తున్న డీఎల్‌పీవో పద్మావతి, ఎంపీడీవో జనార్దన్

ముండ్లమూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం చేపల చెరువు సర్వే నెంబరు 207లో మూడు సంవత్సరాల పాటు 83.90 ఎకరాల్లో చేపలు పట్టుకొనేందుకు శుక్రవారం సర్పంచ్ వేముల పద్మావతి అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో 20 మంది పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి, అద్దంకి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న దిద్యాల సుధాకరరెడ్డి రూ.17.50 లక్షలకు పాట పాడి చెరువును దక్కించుకున్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిని గుర్తించి రికవరీ చేయాలి

» ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్

» గుట్టుచప్పుడుగా

సోషల్ ఆడిట్ నిర్వహణ



సామాజిక తనిఖీలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్

కనిగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిని గుర్తించి నిధుల రికవరీ చేపట్టాలని నరేగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై స్థానిక స్త్రీశక్తి భవనంలో సామాజిక తనిఖీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీ జోసఫ్‌కుమార్ కనిగిరి మండలంలో 16వ విడత కింద 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జరిగిన తనిఖీలో భాగంగా 785 వర్కులకు సంబంధించి రూ.9.36 కోట్లతో పనులు నిర్వహించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ కింద 69 వర్కుల కింద రూ.2.73 కోట్లతో పనులు చేపట్టినట్లు లెక్కలు తేల్చినట్లు పరిశీలించారు. రూ.14.36 లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి ఆయా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా నిధులను రికవరీ చేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో కనిగిరి అసిస్టెంట్ ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన విచారణలో రూ.1.19 లక్షలు, ఎంపీడీవో పరిధిలో 2.63లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ఆయా నిధులను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో కుంటలు పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి పనులే చేపట్టకుండా రికార్డుల్లో నమోదు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగులేరు గ్రామంలో జరిగిన పనుల్లో భారీ స్థాయిలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పునుగోడు గ్రామంలో జాబ్ కార్డుల పేరుతో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. నిర్దేశిత కాలవ్యవధిలో రికవరీ చేయాలని పీడీ అధికారులు, సిబ్బందిని అదేశించారు.

అయితే, సామాజిక తనిఖీ నిర్వహణ విషయం గ్రామస్థులకు తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కుబడిగా రికవరీ చేశారని, లోతుగా తనిఖీ నిర్వహిస్తే కోట్లాది రూపాయలు గోల్‌మాల్ వ్యవహారం బయటపడుతుందని చర్చ సాగుతుంది.

కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, ఒంగోలు ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో హనుమంతరావు, ఎస్ఆర్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు భూసేకరణకు సంబంధించిన భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

వాడరేవు - పిడుగురాళ్ల రహదారి పనుల పరిశీలన

పర్చూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల రహదారి పనులను కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. శుక్రవారం పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద రహదారి నిర్మాణం కోసం చేపట్టిన భూములను పరిశీలించారు. అనంతరం రహదారి ఏర్పాటు కోసం చేపట్టిన భూముల వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. హైవేరోడ్డు నిర్మాణంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ సుశీల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కొండమూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ముందస్తు న్యూఇయర్ వేడుకల్లో కేక్ కట్ చేసిన సీడీపీవో కృష్ణకుమారి

పిల్లల సంపూర్ణ ఎదుగుదల లక్ష్యం కావాలి

పంగులూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) :అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల సంపూర్ణ ఎదుగుదల లక్ష్యంగా పని చేయాలని కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ కృష్ణకుమారి సూచించారు. మండలంలోని కొండమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నూతన సంవత్సర వేడుక నిర్వహించారు. ముప్పవరం సెక్టార్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీవో కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, అరుణకుమారి, రమాదేవి, కార్యకర్తలు మాధవి, అంజలి, ఉదయకుమారి, సెక్టార్ పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కారంచేడు - స్వర్ణ ప్రాంతాల్లో నేలకొరిగి దెబ్బతిన్న వరి పంట

వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కారంచేడు(పర్చూరు), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు నేలకొరిగి దెబ్బతిన్న వరి పంటకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు కోరారు. పైరు చేతికి అందివస్తున్న తరుణంలో ఇలా ప్రకృతి వైపరీత్యంతో వందల ఎకరాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయన్నారు. కారంచేడు మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ తదితర ప్రాంతాల్లో పైర్లు దెబ్బతిన్నాయన్నారు.

మైనార్టీ సంస్థలకు నిధులు విడుదలపై హర్షం

చినగంజాం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మైనార్టీ సంస్థల నిర్మాణాల కోసం కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి జనవికాస్ పథకంద్వారా విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు షేక్ జిలాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ సంస్థల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరుపున తొలి విడతగా రూ.26.13 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. నిధులు విడుదల చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డీ.ఫరూక్‌లకు జిలాని ధన్యవాదాలు తెలియజేశారు.

నీటి కుంటల జాడేదీ

రెండు గ్రామాల్లో అర్థాంతరంగా నిలిచిన పనులు



ముక్తేశ్వరం ఫారెస్టు కొండ వద్ద పనులు నిలుపుదల చేసిన నీటి కుంట

బల్లికురవ. డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు గతంలో ప్రభుత్వం నీటి కుంటల ఏర్పాటుకు నిధులను మంజూరు చేసింది. ఈ పనులను ఉపాధి హామీ కింద కూలీలతో చేపట్టింది. కానీ పనులు అర్థాంతరంగా ఆగి పోవటంతో నీటి కుంటల ఏర్పాటు పనులు నిలిచి పోయాయి. ఫారెస్టు శాఖ నుంచి సేకరించిన భూములు సైతం ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషితో అజాదికా అమృత్ సరోవర్ ద్వారా బల్లికురవ మండలం ముక్తేశ్వరం, ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటుకు ఉపాధి హామీ కింద రూ. 50 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ కుంటల తవ్వకాలను ఉపాధి కూలీలు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాది జనవరిలో రెండు గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటుకు కావాల్సిన భూములను ఫారెస్టు పరిధిలో సేకరించారు. ఈ భూములలో పనులు ప్రారంభించారు. కూలీలు కొంత మేర పనులు చేపట్టి తరువాత నిలిపి వేశారు. ఎంతో ఆర్భాటంగా నీటి కుంటల ఏర్పాటుకు చేపట్టిన పనులు నిలిచి పోవటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిధులు ఉండి కూడా పనులు చేయటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు గ్రామాలలో తిరిగి అమృత్ సరోవర్ కింద నీటి కుంటల ఏర్పాటు పనులు చేయించాలని వారు కోరుతున్నారు.

ఆర్‌వో ప్లాంట్‌లలో నీటి ధర పెంపు

సర్వత్రా విమర్శలు



అద్దంకి, డిసెంబరు27(ఆంధ్ర జ్యోతి): అద్దంకిలో పేద, మధ్య తరగతి ప్రజలకు శుద్ధి జలం అందుబాటులో ఉంచేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌లలో నీటి ధరను పెంచడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కాకానిపాలెం, భవానీసెంటర్, ఇందిరానగర్, నర్రావారిపాలెంలలో 4 ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ఆర్‌వో ప్లాంట్‌లు ఉన్నాయి. 20 లీటర్ల నీటిని 2 రూపాయలు చొప్పున అందజేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి భారం లేకుండా ఉంది. ఆర్‌వో ప్లాంట్‌ల నిర్వహణ ఆయా ప్రాంతాలలో ఉన్న స్థానికులకే అప్పగించారు. గతంలో ఇందిరానగర్‌లోని ఆర్‌వో ప్లాంట్‌లో సేవా సంస్థ తరఫున ఉచితంగా నీటిని అందజేశారు. అనంతరం మూతపడటంతో మళ్లీ తెరిపించి అక్కడ కూడా 2 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. రెండు నెలల క్రితం భవానిసెంటర్‌లోని ఆర్‌వో ప్లాంట్‌లో ధర 5 రూపాయలకు పెంచగా మున్సిపల్ అధికారుల దృష్టికి పోవటంతో తిరిగి 2 రూపాయలకు అమ్మేలా చర్యలు చేపట్టారు. అయితే గత ఐదారు రోజులుగా 4 చోట్ల ఉన్న సుజల స్రవంతి ఆర్‌వో ప్లాంట్‌లలో 5 రూపాయలు చొప్పున విక్రయించటం ప్రారంభించారు. అయితే ఈ విషయాన్ని కనీసం మున్సిపల్ అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టి కి కూడా తీసుకుపోకుండా ధర పెంచటం విమర్శలకు తావిస్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాత పద్ధతిలోనే 2 రూపాయలకు 20 లీటర్ల నీటిని అందజేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ తప్పనిసరి

- ఎస్పీ తుషార్ డూడీ
- అద్దంకి, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌ల ఆకస్మిక తనిఖీ
- సీజ్ చేసిన వాహనాలు భద్రపరచటంపై సూచనలు



మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

అద్దంకి/మేదరమెట్ల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మృతులలో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే ఉంటున్నారని, పోలీస్‌లతో సహా ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. అద్దంకి, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఆవరణ లో సీజ్ చేసి ఉంచిన వాహనాలు పరిశీలించి వాటిని భద్రరచటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రికార్డులను పరిశీలించారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లలో నేరాల తీరు, వాటి దర్యాప్తు గురించి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెల్మెట్ ధరించి ఉంటే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని, హెల్మెట్ వినియోగం వలన కలిగే ప్రయోజనాలపై వాహనచోదకులకు మరింత అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయటానికి నిర్మానుష్య ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అద్దంకిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పోలీస్ స్టేషన్‌లో పరిశీలించారు. సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్, అద్దంకిటౌన్ సీఐ కృష్ణయ్య, మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

ఏరియా వైద్యశాలకు డెంటల్ ఎక్స్‌రే మిషన్ అందజేత



డెంటల్ ఎక్స్‌రే మిషన్‌ను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఏరియా వైద్యశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల వారు ఎన్ఆర్ఐ తాడేపల్లి విజయ్ కుమార్ అందించిన రూ.45వేలు ఆర్థిక సాయంతో శుక్రవారం డెంటల్ ఎక్స్‌రే మిషన్, ఫిల్మ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతల సహకారంతో తాము అందిస్తున్న వీటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, కరణం శ్రీనివాసబాబు, గుర్రం రాఘవరావు, శ్రీరాం రమేష్, మామిడాల శ్రీనివాసరావు, సురేష్, ప్రసాద్, స్వామి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీల పెంపు

- సమావేశంలో టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై ఆపార్టీ నేతలే ధర్నాలు చేయటం తుగ్లక్ చర్యలను తలపిస్తున్నదని తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కోనేటి అనిల్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నేతలు మాట్లాడారు. ట్రూఅప్ చార్జీల భారం ఖచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసే ప్రజల నెత్తిన వేసిన భారమని అన్నారు. రెండేళ్ల క్రితమే విద్యుత్ చార్జీలను పెంచాలని జగన్‌రెడ్డి ఈఆర్సీని కోరారన్నారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అద్దంకి పట్టణ ఉపాధ్యక్షుడు దొప్పలపూడి దుర్గా ప్రసాద్, బిళ్లపాటి రామాంజనేయులు, నర్రా శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ సివిల్ న్యాయాధికారిణి శాంతి

దాతల సహకారాన్ని సద్వినియోగించుకోవాలి

- జూనియర్ సివిల్ న్యాయాధికారిణి శాంతి

పర్చూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం కృషితో అభివృద్ధిని సాధించాలన్న సంకల్పంతో దాతలు అందజేసిన కుట్టుమిషన్‌లను సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పి.శాంతి అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, పర్చూరు రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 20 మంది నిరుపేదలకు స్థానిక రోటరీ భవనంలో శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్‌లను న్యాయాధికారిణి పంపిణీ చేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం మహిళలకు మిషన్‌లను అందజేశామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, కోశాధికారి పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖర్, న్యాయవాదులు కొల్లా నరేంద్ర కుమార్, రావి సత్యనారాయణ, క్లబ్ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, నాగభైరు శ్రీనివాసరావు, భవనం రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

బాలుడి వైద్య ఖర్చులకు రోటరీ ఆర్థిక సాయం

అద్దంకిటౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యఖర్చుల నిమిత్తం శింగరకొండ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. రోటరీ ఇంటర్‌నేషనల్ 2024-25 ప్రెసిడెంట్ ఏ. ఉర్చిక్ పుట్టినరోజు సందర్భంగా అద్దంకిలోని కొత్తపేటకు చెందిన బొర్రా ఆదిలక్ష్మి కుమారుడు వెంకటేష్ (10) బాలుడుకు రక్తంలో ఇన్ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురి అయ్యాడు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆరు వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని రోటరీ సభ్యుల సహకారంతో అందించామని క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళి సుధాకర రావు, మహమ్మద్ రఫీ, ఆంజనేయులు, దేవపాలన, మురళీ కృష్ణ, లేవి ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు నిబంధనలు తప్పనిసరి

డీఎస్పీ మొయిన్

చీరాలటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలకు రిసార్ట్ నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ ఎండి మొయిన్ అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం రాత్రి సముద్రతీరంలోని రిసార్ట్ యజమానులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చట్ట ప్రకారమే వేడుకలు జరగాలని, ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రిసార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతికి ఏలూరి సంతాపం

పర్చూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ లేని లోటు పూడ్చలేనిదని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మాజీ ప్రధాని మృతి పట్ల ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మీసేవలో చోరీకి పాల్పడిన నిందితుడు అరెస్ట్



ప్రవీణ్‌కుమార్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం మీసేవ సెంటర్‌లో చోరీకు పాల్పడిన గొల్లంగి ప్రవీణ్ కుమార్‌ను ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పద్మనాభపురానికి చెందిన ప్రవీణ్ విలాసాలకు బానిసగా మారాడు. ఈక్రమంలోనే పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడు. గతనెల 30వ తేదీన ఇదే తరహాలో ఈపూరుపాలెం ప్రధాన రహదారిలోని పలు దుకాణాల్లో చోరీలకు యత్నించాడు. కాటూరి చెంబయ్యకు చెందిన మీసేవ తాళాలు పగలకొట్టి రూ.30 వేలు అపహరించాడు. ఈనేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే సిగరాయకొండలో ఓ చోరీ కేసులో గాలింపు చేపట్టిన పోలీసులకు ఈపూరుపాలెం ఘటనపై కూడా నేరాన్ని ప్రవీణ్ అంగీకరించాడు. ఈక్రమంలో ఇక్కడి పోలీసులు పీటీ వారెంట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకోనున్నారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

మార్టూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):ఆత్మహత్యాయత్నం చేసి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన చామర్తి నాగసరిత (45) అనే మహిళ మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని మార్టూరులోని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. మార్టూరు గ్రామానికి చెందిన నాగసరిత ఈ నెల 17 న ఇంటిలో ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విదితమే.



రోడ్డు పక్కన పడిపోయిన డంపర్

డంపర్ బోల్తా

మార్టూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మార్టూరు పచ్చి మిర్చికూరగాయల మార్కెట్ ముందు ఉన్న సర్వీసు రోడ్డులో శుక్రవారం వేకువజామున డంపర్ వాహనం రోడ్డు పక్కన పడిపోయింది.డ్రైవరు నిద్రమత్తులో ఉండటంతో వాహనం రోడ్డు పక్కన సైడుకాల్వపైకి వెళ్లి బోల్తా పడింది. హైవే విస్తరణ పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్న డంపర్ వాహనం గ్రావెల్ కోసం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

పరారీలో ఉన్న మహిళ అరెస్ట్

చీరాలటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గతకొంత కాలంగా ఎక్సైజ్ పోలీసులు కళ్లుగప్పి పరారీలో ఉన్న ఆదినారాయణపురంకు చెందిన ఆవుల అరుణను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఆమెపై గతంలో నాటుసారా కేసు నమోదయి ఉంది. మొగిలి రంగయ్య కాలనీలో 200 లీటర్లు , రామనగర్‌లో 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఆయా ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు వివరించారు. దాడుల్లో ఎస్సై శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

3న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు వచ్చే నెల 3వతేదీన నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకుముందు జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సదరన్ ఇండియన్ సైన్స్ ఫెయిర్‌ను శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, సమూహ, ఉపాధ్యాయ విభాగాల్లో జరిగే ఈ పోటీల నుంచి ఒక్కో ప్రాజెక్ట్‌ను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ నెల 30న మండలస్థాయి పోటీలు నిర్వహించి ప్రతి మండలం నుంచి ఉత్తమ ప్రాజెక్ట్‌ను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు


శనివారం 28 డిసెంబరు 2024



ఆత్మకూరు : నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కులో నిర్మాణంలో ఉన్న రహదారి

'ఆత్మ' ఘోషిస్తోంది!

ఆర్భాటంగా ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలో 173 ఎకరాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ పార్కుకు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీంతో ఆత్మకూరు పారిశ్రామికంగా అడుగులు వేస్తుందని ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. ఆ క్రమంలో ఈ పార్కులో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. కానీ ఏం జరిగిందో ఏమో ఈ పరిశ్రమ జగన్ సొంత జిల్లా కడపలోని బద్వేల్ నియోజకవర్గానికి తరలిపోయింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటు ఊసే లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పారిశ్రామికవాడలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కొలిక్కి వచ్చింది. 67 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నీటి వసతి కోసం రూ.13 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో కేంద్రం రూ.10.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.12.93 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. రూ.8 కోట్లతో మిగిలిన రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నారు. మరో మూడు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయి. విద్యుత్, నీటి వసతి కల్పించాల్సి ఉంది.



ఆశలు రేపుతోంది!

రామాయపట్నం పోర్టు అనుసంధానంగా బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దాదాపు రూ.95వేల కోట్ల పెట్టుబడితో ఇంత భారీ పరిశ్రమ రానుండగా, దీని అనుసంధానంగా సుమారు 15 పరిశ్రమలు పోర్టు సమీపంలో ఏర్పాటు కానున్నాయి. దీంతో దాదాపు 5వేల మందికి ప్రత్యక్షంగా, మరో లక్ష మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే పోర్టు సమీపంలో బీపీసీఎల్ కోసం ఏపీఐఐసీ భూసేకరణ చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ ముందస్తు కార్యకలాపాల కోసం రూ.6100 కోట్లు విడుదల చేసింది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే పోర్టు సమీపంలో పెట్రో కెమికల్ ప్లాంట్, లూబ్రికెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్, ఫ్యూయల్ ఆడిటివ్స్, వ్యాక్స్ ప్రొడక్షన్, ఆఫాల్ట్ ప్రొడక్షన్ ప్లాంట్, సల్ఫర్ రికవరీ ప్లాంట్, కెటలిస్ట్ మానుఫ్యా క్చరింగ్ రిఫైనరీ మెయిం టెనెన్స్ సర్వీస్ ప్లాంట్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్ ప్లాంట్, ఎన్విరాన్‌మెంట్ ప్లాంట్, ట్యాంక్ మ్యానుఫ్యాక్చరింగ్, పైప్స్ మ్యాన్‌ఫ్యాక్చ రింగ్, వాల్వ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇన్సులేషన్ అండ్ రిఫ్రాక్టరీ సర్వీస్, లాజిస్టిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లాంట్ ఇలా దాదాపు 15 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

నాడు

తిరోగమనం..

సార్వత్రిక ఎన్నికలతో జిల్లా ప్రస్థానాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ ఏడాది.. పారిశ్రామిక రంగానికి మరకలతో పాటు మెరుపులనూ అందించింది. గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కొత్త పరిశ్రమల ఏర్పాటు అటుంచితే ఉన్న పరిశ్రమలు కూడా మూతపడే స్థాయికి చేరిపోయాయి. ఇక ఉపాధి కోసం యువతతో పాటు గ్రామీణ ప్రజానీకం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా ఏడాదిలో మొదటి సగం.. పారిశ్రామిక రంగం

ప్రగతిపథం

అథోగతిని చవిచూసిన జిల్లా.. తదుపరి ఆరునెలలు మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జిల్లాపై శ్రద్ధ చూపడంతో గణనీయమైన పురోగతి వైపు పరుగులు పెడుతోంది. పోర్టుల ఆధారంగా ఎన్నో పరిశ్రమలు రానుండగా, ఇండస్ట్రియల్ కారిడార్‌లూ ఏర్పడనున్నాయి.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



ఆత్మకూరు : నారంపేట వద్ద ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన స్థలం

జిల్లా పారిశ్రామిక రంగంలో

మరకలు, మెరుపులు

నేడు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. ఆశావహులు కూడా పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈల అభివృద్ధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా అధికారులు ఎంఎస్‌ఎంఈల వివరాలను సేకరిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా ఎంఎస్‌ఎంఈలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించనున్నారు. అదేవిధంగా జిల్లాలోని కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల ఆధారంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లావైపు చూస్తున్నాయి. సముద్ర తీర ప్రాంతం ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం సీబీఐసీ (చెన్నై- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్), వీసీఐసీ (విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్) ఏర్పాటు చేస్తోంది. ఈ రెండు కారిడార్‌లు జిల్లాకు అనుసంధానంగా వెళుతుండటంతో అనేక అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం ఏర్పడింది.

● పోర్టులతో వేగంగా అభివృద్ధి

కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు రానున్నాయి. కృష్ణపట్నం పోర్టు ఆనుకొని 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. సీబీఐసీలో భాగంగా మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం రూ.2139.44 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా రామాయపట్నం పోర్టు ఆనుకొని మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన 2500 ఎకరాల భూసేకరణ పూర్తి కావస్తోంది. దీంతో నెల్లూరు జిల్లాలో ఇప్పటికే రెండు పోర్టుల అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమలైన ఇండోసోల్ సోలార్, జాన్సన్ ఇన్‌ఫ్రా, జేఎస్‌డబ్ల్యూ, ఉత్కర్ష లిమిటెడ్, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ, శ్రీచక్ర లిమిటెడ్, విశ్వసముద్ర లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు పనులు ప్రారంభించాయి కూడా.

అనాలోచిత నిర్ణయాలతో..

వైసీపీ హయాంలో రాష్ట్రంతోపాటు నెల్లూరు జిల్లాలో అనేక పరిశ్రమలు మూత పడ్డాయి. అప్పటి పాలకుల అనాలోచిత నిర్ణయాలతో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు. ఏపీఐఐసీ ద్వారా భూములను విక్రయించే సేల్ డీడ్ విధానాన్ని రద్దు చేసింది. కేవలం భూములు లీజు తీసుకొనే విధానాన్ని ప్రవేశపెట్టడంతో నూతన పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం మానేశారు. దీంతో ఔత్సాహికుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహ నెలకొంది. వైసీపీ నాయకులు పలు పరిశ్రమల యజమాన్యాలను అనేక విధాలుగా వేధింపులకు గురి చేయడంతో పరిశ్రమల ఏర్పాటు అటుంచితే ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయి!



● ఒక్క ప్లాటూ అమ్ముడుపోలేదు!

జిల్లాలో ఉన్న ఎంఎస్‌ఎంఈ పార్కుల్లో ఉన్న ప్లాట్లలో ఒక్కటి కూడా గడిచిన ఐదేళ్లలో అమ్ముడుపోలేదు. దీనికితోడు వైసీపీ ప్రభుత్వం అనేక పర్యాయా లు విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆ భారం భరించలేక అనేక చిన్న చితకా పరిశ్ర మలు మూత పడ్డాయి. ఇక పరిశ్రమల్లో ఉద్యోగాల నియామక ప్రక్రియల్లో రాజకీ య జోక్యం ఎక్కువైంది. భూ సమస్యలు పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.



'రాళ్లపాడు' నిండిందోచ్!

● ఏ క్షణమైనా గేట్లు ఎత్తి నీరు విడుదల చేసే అవకాశం

లింగసముద్రం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు రిజర్వాయర్ మూడేళ్ల తర్వాత పూర్తి సామర్థ్యానికి మించి నిండింది. గడిచిన నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఈ వర్షాలకు ముందు 19.11 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 20.6 అడుగులకు చేరింది. వాస్తవానికి డ్యాం సామర్థ్యం 20 అడుగులు. అయితే ప్రాజెక్టులో 21.6 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అంతకుమించితే ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని రేడియల్ గేట్లపై నుంచి నీరు పొర్లిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కుల మేర ఉందని ప్రాజెక్టు డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

● ప్రజల అప్రమత్తం

ఒకవేళ ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం పెరిగితే గేట్లను ఎత్తి దిగువ మన్నేరుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. దీంతో మన్నేరు పరివాహక ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

● 'సోమశిల'కు 4,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,100 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.784 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు'లో 57 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంలో 57 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 1,310 క్యూసెక్కులు, వివిధ కాలువల ద్వారా అవుట్ ఫ్లో 715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

నీరసం.. నిరుత్సాహం!

- వైసీపీ ఆందోళనలో కనిపించని ఉత్సాహం.
- పలుచోట్ల మొక్కుబడిగా ఆందోళనలు
- పార్టీ హడావిడి తప్ప ప్రజల్లో కనిపించని స్పందన



కావలిలో అతికొద్ది మందితో ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

నెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు జగన్ ముడుపులే కారణమని రాష్ట్రం మొత్తం ఘోషిస్తుంటే దానికి కూటమి ప్రభుత్వాన్ని దోషిగా చూపుతూ శుక్రవారం వైసీపీ చేపట్టిన ఆందోళనకు ప్రజా మద్దతు నామమాత్రంగానే కనిపించింది. వైసీపీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు తప్ప సామాన్య ప్రజలెవరూ ఈ ఆందోళనలో పాదం కలపలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర పార్టీ కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించిన నాయకులు ప్రతిపక్ష హోదాలో చేపట్టిన తొలి కార్యక్రమంలోనే నీరసంగా కనిపించారు. జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకటైన మేకపాటి కుటుంబానికి చెందిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉదయగిరిలో ఆందోళనకు పిలుపునిచ్చారు. కానీ ఆందోళన మాత్రం పేలవంగానే జరిగిందని చెప్పాలి. మహా అయితే వంద మందికి అటు ఇటుగా జనం పాల్గొన్నారు. అది కూడా వైసీపీ కార్యకర్తలు, మేకపాటి అనుచరులే. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కూడా మొహం చాటేశారు.

● కావలిలో ఏకంగా ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డే గైర్హాజరు అయ్యారు. స్థానిక పార్టీ నాయకులే ఈ ఆందోళనను మమ అనిపించారు. ఇక్కడా మహా అయితే వంద మందికి అటు ఇటుగా కార్యకర్తలు హాజరయ్యారు.

● సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం, కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెంలో చేపట్టిన ఆందోళనకు పార్టీ క్యాడర్ ఓ మోస్తారుగా హాజరయ్యింది. ఆందోళనల చేయకతప్పదు అనే మొక్కుబడి తనం నాయకుల్లో కనిపించిడం ఒక విశేషమైతే, ఎక్కడా ప్రజల భాగస్వామ్యం కనిపించకపోవడం మరో విశేషం.

కందుకూరులో వర్గ విభేదాలు

కందుకూరు : వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన మొదటి ఆందోళన కార్యక్రమానికి ఆ పార్టీకి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్యనేతలంతా డుమ్మా కొట్టారు. బుర్రానే స్వయంగా ప్రజాప్రతినిధులకు, ముఖ్యనేతలందరికీ ఫోన్లు చేసి జనసమీకరణ చేసుకుని రావాలని కోరినా అంతా డుమ్మా కొట్టడం విశేషం. నియోజకవర్గంలో 5 మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు వైసీపీ వారే కాగా ఒక్క గుడ్లూరు ఎంపీపీ పులి రమేష్ మినహా మిగిలిన వారెవరూ ఈ నిరసనలో పాల్గొనలేదు. అలాగే నియోజకవర్గంలో 90 శాతానికిపైగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైసీపీ వారే కాగా వారు కూడా ఒకరిద్దరు మినహా ఎవరూ రాలేదు. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా ఇన్చార్జి బుర్రా కార్యక్రమాలు చేస్తుండటమే ఈ పరిణామాలకు కారణంది. ఇటీవల వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలో పూర్వప్రకాశం జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహీధరరెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావులకు ఆహ్వానం అందలేదు. దీంతో వారిద్దరూ సమావే శానికి వెళ్లకపోగా మిగిలిన ప్రజాప్రతినిధులంతా హాజరయ్యారు. ప్రస్తుతం డుమ్మా కొట్టిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఇతర ముఖ్యనేతలు జగన్‌తో జరిగిన సమావేశానికి వెళ్లి వచ్చారు.

డెల్టా ఆధునికీకరణకు రూ.100 కోట్లు

- కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లకు మహర్దశ
- డ్రెయిన్ల రూపురేఖలు మారే అవకాశం

నెల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెన్నార్ డెల్టా ఆధునికీకరణకు రూ.100 కోట్లు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిధులను నాబార్డు నుంచి రుణంగా తీసుకోనున్నారు. కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లతోపాటు డెల్టాలోని కాలువల రూపురేఖలు మారనున్నాయి. రాష్ట్రంలోని సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం నాబార్డు నుంచి రూ.1000 కోట్ల రుణాన్ని సమీకరించింది. అందులో గోదావరి డెల్టాకు రూ.450 కోట్లు కేటాయించగా, కృష్ణా డెల్టాకు రూ.250 కోట్లు కేటాయించింది. పెన్నా డెల్టాకు రూ.100 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ.100 కోట్లు, చిన్న నీటి వనరుల అభివృద్ధికి మరో రూ.100 కోట్లను కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. ఈ కేటాయింపుల ప్రకారం డెల్టాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో కనిగిరి రిజర్వాయర్, సర్వేపల్లి రిజర్వాయర్‌లతోపాటు డ్రెయిన్లను అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కనిగిరి రిజర్వాయర్ కట్టను పటిష్టపరచనున్నారు. అలానే రివిట్‌మెంట్ కూడా చేయనున్నారు. రిజర్వాయర్ నుంచి వెళ్లే కాలువలను ఆధునికీకరించనున్నారు. ఇందుకుగానూ రూ.27.69 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అలానే సర్వేపల్లి రిజర్వాయర్ కరకట్టలను కూడా పటిష్టపరచడంతోపాటు రివైట్‌మెంట్ చేసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడా తూములు, కాలువలను ఆధునికీకరించనున్నారు. ఇందుకోసం రూ.35.41 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఇక పైడేరు మేజర్ డ్రెయిన్, అల్లూరు స్వాంప్ మేజర్ డ్రెయిన్లను ఆధునికీకరించేందుకు రూ.36.88 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, అన్నిటినీ జిల్లా నుంచి చీఫ్ ఇంజనీర్‌కు పంపారు. అక్కడ నుంచి ఈఎన్‌సీకు చేరుతాయి. అక్కడ ప్రతిపాదనలను ఫైనల్ చేసి ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించగానే ఉత్తర్వులు వెలువడుతాయి. తదుపరి టెండర్లు పిలిచి పనులు మొదలుపెడతారు.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు ముందడుగు

నగరంలో స్థలాన్ని పరిశీలించిన అధికారుల బృందం 6

ఎస్ఐ శివకృష్ణారెడ్డి సస్పెన్షన్

నెల్లూరు (క్రైం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ముత్తుకూరు, కృష్ణాపట్నం పోర్టు పోలీసుస్టేషన్లలో ఎస్ఐగా పనిచేసిన శివకృష్ణారెడ్డిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెండ్ చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి శివరామకృష్ణారెడ్డి వీరభక్తుడిగా పేరు తెచ్చుకున్నారు. వైసీపీ నాయకులు చెప్పిన మాటలను శిరసావహిస్తూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారు. ఈ వ్యవహారాలపై ఆధారాలతో సహా హోం మంత్రి, డీజీపీ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఎస్పీలకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారించిన పోలీసు శాఖ శివకృష్ణారెడ్డిని సస్పెండ్ చేసింది. ఎనిమిది నెలల క్రితమే శివకృష్ణారెడ్డి జిల్లా నుంచి గుంటూరుకు బదిలీ అయ్యారు.

ఆదాయం ఎక్కడ!?

ఆర్థిక వనరులపై 'నుడా' దృష్టి ● ఎంఐజీ లేఅవుట్ల ఏర్పాటుకు కసరత్తు ● భూసేకరణ బాధ్యతలు జేసీకి

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)ను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం లేఅవుట్లు అపార్ట్‌మెంట్ల ఫీజులతోనే కాలం గడుపుతూ ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతూ వచ్చింది. ఈ కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించడం, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆర్థిక వనరులను సమకూర్చేందుకు సూచనలు చేయడంతో అందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. నుడాకు ప్రధాన ఆదాయ వనరు

- మిగతా 6లో..



ఎంఐజీ లేఅవుట్లపై దృష్టి పెట్టాం

ఆర్థిక కష్టాల్లో ఉన్న నుడాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంఐజీ లేఅవుట్లే కీలకం. ఇందుకోసం 8 నియోజకవర్గాలలో ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నాము. వీటితో పాటు ప్రైవేటు స్థలాలనూ అభివృద్ధి చేసి అమ్మేందుకు రియల్‌ఎస్టేటర్లను ఆహ్వానిస్తున్నాం.

- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా చైర్మన్



స్వామియే..
శరణం అయ్యప్ప!

నెల్లూరు నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో జరుగుతున్న మండల పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామికి నగరోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారు ఉదయం అయ్యప్పగుడి నుంచి మంగళ వాయిద్యాలతో నవాబుపేట శివాలయంకు చేరుకుని విడిది చేశారు. సాయంత్రం అక్కడ సర్వాలంకార భూషితుడై నగరోత్సవంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. విద్యుద్దీపాలంకరణలు, కేరళ వాయిద్యాలు, కావడిలు అయ్యప్ప నామస్మరణల నడుమ సాగింది. నగరోత్సవం నవాబుపేట, పప్పులవీధి, స్టోన్‌హౌస్‌పేట, ఏసీ బొమ్మ, ట్రంకురోడ్డు, గాంధీ బొమ్మ, వీఆర్‌సీ, ఆర్టీసీ, కేవీఆర్ సెంటర్, బొల్లినేని ఆసుపత్రి, దర్గామిట్ట, వేదాయపాలెం, అయ్యప్పగుడికి చేరుకుంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు జి.శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరులో అఖిల భారత క్యారమ్ పోటీలు

- దేశవ్యాప్తంగా 400 మంది క్రీడాకారుల హాజరు
- జనవరి 5 నుంచి 8వతేదీ వరకు నిర్వహణ



వివరాలు వెల్లడిస్తున్న క్యారమ్ సంఘం ప్రతినిధులు శ్రీమన్నారాయణ, రఘురామ్ శ్రీధర్ తదితరులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో తొలిసారిగా అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల శ్రీమన్నారా యణ తెలిపారు. నగరంలోని నెల్లూరు క్లబ్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత పోటీల నిర్వహణకు క్యామర్ ఫెడరేషన్ తమకు అనుమతిచ్చిందన్నారు. జన వరి 5 నుంచి 8వతేదీ వరకు నెల్లూరు క్లబ్ ప్రాంగణంలోనే పోటీల నిర్వహ ణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ పోటీలకు దేశంలోని 24 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలు, భారతీయ సంస్థలకు చెందిన 400 మంది క్రీడాకారులు, వీరితో పాటు 8 మంది ప్రపంచ చాంపియన్లు పోటీలకు హాజరవుతున్నారన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి అంతర్జాతీయ క్యామర్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్, ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, అస్సాం ఎంపీ రకిబుల్ హుస్సేన్, ప్రతినిధులు, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, అధికారు లు హాజరవుతారని తెలిపారు. జిల్లావాసులు, క్రీడాకారులు పోటీలను తిలకిం చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ కార్యదర్శి వీ రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ!?

- పారిశుధ్యం మెరుగుకు వాహనాల కొనుగోలు
- నిర్వహణ లేక అనతికాలంలోనే మూలకు
- కావలిలో తుప్పుపడుతున్న వాహనాలెన్నో

పారిశుధ్యం మెరుగుదలకు కావలిలో చేపట్టిన పలు ప్రయోగాలు సత్ఫలితాలు ఇవ్వక అవి చెత్త ప్రయోగాలుగా మిగిలిపోయాయి. మున్సిపల్ ఖజానా నుంచి రూ.కోట్లు పోసి కొనుగోలు చేసిన వాహనాలు నిర్వహణ లోపం కారణంగా తుప్పుపడుతున్నాయి. చిన్నపాటి మరమ్మతుకు గురైనప్పుడే వాటిని బాగు చేసి ఉంటే జీవితకాలం పని చేసి ఉండేవి. అలాంటిది అధికారులు వదిలేయడంతో రోడ్లపక్కన, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మట్టిలో కలిసిపోతున్నాయి. కాలం చెల్లిన వాహనాలను బహిరంగ వేలం వేసి విక్రయించాలంటే రవాణా శాఖ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తీసుకోవాలి. ఇందుకుగాను ఎప్పటికప్పుడు రవాణా శాఖ అధికారుల నుంచి ఎఫ్‌సీలు తీసుకోలేదు. ఇప్పుడు తీసుకోవాలన్నా ఆ శాఖకు భారీస్థాయిలో పెనాల్టీలు చెల్లించాలి. దీంతో మూలనపడ్డ వాహనాలకు వేలం ద్వారా వచ్చే డబ్బులు కన్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం చెల్లించే పెనాల్టీలే ఎక్కువవుతున్నందున వాటిని అలా వదిలేశారు. చివరకు అవి పాత ఇనుము తుప్పుకు కూడా పనికి రాకుండా పోతున్నాయి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



ఒకప్పుడు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించిన ఆటోలు ఇవి. సేకరించిన చెత్తను ఆ ఆటోలద్వారానే కంపోస్ట్ యార్డుకు తరలించేవారు. అయితే, కంపోస్ట్ యార్డు పట్టణానికి దూరంగా వెళ్లటంలో ఆ ఆటోలను ఇదిగో ఇలా పక్కన పెట్టేశారు. ఆ తర్వాత కూడా క్లాప్ ప్రోగ్రాం కింద తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఒక ఏజెన్సీ సంస్థ 8 ఆటోలను మున్సిపాలిటీకి నెలసరి అద్దె ప్రాతిపదికన అప్పగించింది. ఇప్పుడు వాటిని కూడా మూలన పడేశారు.



చిన్నసంధుల్లో చెత్త వేసేందుకు ఉంచిన చిన్న డంపర్ బిన్లను తరలించేందుకు ఈ ఆటోను కొనుగోలు చేశారు. కొంత కాలం దీనిని వినియోగించారు. పట్టణానికి దూరంగా కంపోస్టుయార్డును తరలించడంతో ఈ ఆటోను ఇదిగో ఇలా మూలన పడేశారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



భారీ డంపర్ బిన్‌లను తరలించేందుకు ఈ లారీని కొనుగోలు చేశారు. హైడ్రాలిక్ సిస్టం ద్వారా డంపర్‌బిన్‌లను లారీలోకి ఎత్తి వాటిని కంపోస్ట్ యార్డుకు తీసుకెళ్లి అక్కడ చెత్తను పోసి తిరిగి యథాస్థితిలో డంపర్‌బిన్లను ఉంచేందుకు ఈ లారీ ఉపయోగపడుతుంది. ఇది బాగానే ఉన్నా డంపర్‌బిన్లలో చెత్త అక్కడే వాహనంలోకి లాక్కొనే కంపాక్టర్ వాహనాలు రావటంలో దీనిని వాడటం మానేశారు.



చెత్తను తరలింపులో మున్సిపాలిటీకి విశేష సేవలందించిన ట్రాక్టర్ ఇది. సరైన నిర్వహణలేక మరమ్మతుకుగురై ఇదిగో ఇలా మూలన పడేశారు. మూడు ట్రాక్టర్లను ఇలా మూలన పడేసి అద్దెకు మరో మూడు ట్రాక్టర్లు తీసుకుని తిప్పుతున్నారు.

వెడల్పాటి రోడ్లను శుభ్రం చేసేందుకోసం ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. అయితే, నిర్వహణంపై అవగాహన లేక దానిని మూలన పడేయటంతో తుప్పు పట్టి పాడైపోతోంది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ప్రవేశ మార్గంలో ఇదిగో ఇలా ప్లాస్టిక్ పట్ట కప్పి ఉంచారు.



రోడ్లపై వెళ్లే వారు తమ వద్ద ఉన్న కాగితాలు, కవర్లు వంటి చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఇలా స్టాండ్‌లు ఏర్పాటు చేసి డబ్బాలు అమర్చారు. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఆ డబ్బాలు మయం అయ్యాయి. వాటి కోసం అమర్చిన స్టాండ్‌లు మాత్రం ఇదిలో ఇలా దర్శనం ఇస్తున్నాయి.



రోడ్లకు ఇరువైపులా, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటేందుకు కోసం రంధ్రాల ఏర్పాటుకు ఈ యంత్రాన్ని వినియోగించేవారు. సంవత్సర కాలంపాటు మున్సిపాలిటీకి సేవలందించింది. ఆ తర్వాత ఇలా మూలకు చేరింది.



పెద్ద పెద్ద మురుగు కాలువలలో పూడిక తీసేందుకు ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొంతకాలం దీనిని వినియోగించి, ఆ తర్వాత మరమ్మతుకు గురవడంతో ఇలా సేదతీరుతోంది.



లైఫ్ సర్టిఫికెట్లకు వేళాయె!

- పెన్షనర్ల జీవన ధ్రువీకరణకు సర్టిఫికెట్ల సమర్పణ
- ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్ దారులు తాము జీవించి ఉన్నట్లు ధ్రువీకరిస్తూ ప్రతి సంవత్సరం సంబంధిత ట్రెజరీల్లో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. అలా సమర్పిస్తేనే వారికి పెన్షన్ ఆగకుండా కొనసాగు తుంది. లేకపోతే పెన్షన్ ఆగిపోతుంది. అదే జరిగితే పెన్షన్‌ను పునరుద్ధరించుకోవడానికి నానా ఇబ్బందులు పడాలి.

జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు

ప్రభుత్వ పెన్షన్‌దారులు 2025వ సంవత్సరానికి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి జిల్లాలోని అన్నీ ట్రెజరీ కార్యాలయాలతోపాటు, కొన్ని ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ధ్రువీకరణలు సమర్పించవచ్చు.



స్వీకరణ కేంద్రాలు

- డివిజనల్ ఉపఖజానా కార్యాలయంలోని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి
- బీవీ నగరంలోని పెన్షన్‌దారుల భవనం
- పాత జడ్పీ భవనంలోని పెన్షన్‌దారుల సంఘం కార్యాలయం
- రెవెన్యూ పెన్షన్‌దారుల కార్యాలయం (జనవరి 6,7,8 తేదీలలో)
- మూలాపేటలోని సరస్వతీ సమాజ భవనం
- దర్గామిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- ఏసీ నగర్‌లోని మునిసిపల్ పాఠశాల



లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

ప్రభుత్వ పెన్షన్‌దారులు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పిం చాలి. జిల్లా ట్రెజరీ డీడీ గంగాద్రి ఆదేశాలతో నెల్లూరు నగరం లో మా కార్యాలయంతో పాటు ప్రత్యేక కేంద్రాలలో ఈ సర్టిఫికెట్లు తీసుకునే ఏర్పాట్లు చేశాం. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

- ఎస్‌కే అహ్మద్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్

ఆదాయం ఎక్కడ!?

(5వ పేజీ తరువాయి)

అయిన ఎంఐజీ లేఅవుట్లపై చైర్మన్ శ్రీనివాసులురెడ్డి దృష్టి సారించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

- భారీగా లేఅవుట్ల ఏర్పాటు

నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లో పెద్దఎత్తున ఎంఐజీ లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో లేఅవుట్లకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 100 ఎకరాల మేర లేఅవుట్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో నుడా యంత్రాంగం భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో కావలిలో 97 ఎకరాలు, కందుకూరులో 25 ఎకరాల్లో నుడా లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇందులో కావలిలోని లేఅవుట్‌లో దాదాపు 70 శాతం ప్లాట్లు అమ్ముడుపోయాయి. కందుకూరులో కేవలం 20 శాతం ప్లాట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. దీంతోనే నుడాకు రూ.25 కోట్ల మేర నిధులు సమకూరాయి. తక్కువ ధరలకు మధ్యతరగతి, ఉద్యోగులకు ప్లాట్లు విక్రయించడం ద్వారా భారీగా నిధులు సమకూర్చుకునే అవకాశం నుడాకు కలుగుతుంది. ఇందు కోసం లేఅవుట్లకు అనువుగా ఉన్న భూములను నుడాకు కేటాయించాలని మంత్రి నారాయణ కలెక్టర్ ఆనంద్‌ను ఆదేశించడంతో ఆ బాధ్యతలు జేసీకి అప్పగించారు. మార్చి నాటికి కనీసం 100 నుంచి 200 ఎకరాల మేర లేఅవుట్లు వేసేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములతోపాటు ముందుకు వచ్చే ప్రైవేటు వ్యక్తుల భూములను కూడా తీసుకొని డెవలప్‌మెంట్ పద్ధతిలో వాటిని అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించేలా నుడా యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు భూములలో లేఅవుట్లు ఏర్పాటు చేయడం ద్వారా రూ.వందల కోట్లు ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు కసరత్తు జరుగతోంది.

ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు ముందడుగు

- ఎంపీ వేమిరెడ్డి కృషితో అధికారుల రాక.. స్థల పరిశీలన

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈఎస్ఐ జిల్లా ఆసుపత్రి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలిసి ఆసుపత్రి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయటంతో శుక్రవారం పరిశీలనకు అధికారులు వచ్చారు. విజయవాడ నుంచి ఈఎస్ఐ రీజనల్ డైరెక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ప్రదీప్, దత్తాత్రేయ, రవికుమార్, కర్తాన్ సింగ్, లీలాకుమారితో కూడిన బృందం నగరం లోని ఈఎస్ఐ డిస్పెన్సరీని సందర్శించి అక్కడ ఖాళీగా ఉన్న 2.18 ఎకరాల స్థలాన్ని పరిశీలించింది. రెండు రోజుల్లో కేంద్రానికి నివేదిక అందచేయనున్నట్లు బృందంలోని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని తెలిపారు. దీనివల్ల అసంఘటిత రంగ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.



నెల్లూరు ఈఎస్ఐ డిస్పెన్సరీ స్థలంలో పరిశీలిస్తున్న అధికారుల బృందం

మహోన్నత వ్యక్తి మన్మోహన్!

- ప్రముఖుల నివాళులు

ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ప్రగతికి మెట్లు వేసిన మహోన్నత వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని, ఆయన మృతి దేశానికి తీరనిలోటుగా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానిగా ఎన్నో విప్లవాత్మక చట్టాలను తీసుకొచ్చిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమంటూ సంతాపం వ్యక్తం చేశారు.

- మంత్రుల సంతాపం

నెల్లూరు (వైద్యం) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామని పేర్కొన్నారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలో తాను రాష్ట్రానికి ఆర్థిక మంత్రిగా పనిచేశానని ఆనం వెల్లడించారు. భారత ఆర్థిక మంత్రిగా ఎన్నో సంస్కరణలు చేపట్టారని ఆర్టీఐ, ఉపాధిహామి పథకం వంటి ఎన్నో పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

- దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది - ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) : మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని, దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతాపం తెలియచేశారు. అలాగే కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కూడా మరో ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎన్నో విప్లవాత్మక సంస్కరణలను ఆయన తీసుకొచ్చి ప్రజల అభ్యుదయానికి కృషి చేశారంటూ కొనియాడారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- కాంగ్రెస్ నేతల నివాళి

నెల్లూరు (వైద్యం) : నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలోనూ దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు మన్మోహన్‌సింగ్ అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, అల్లాఉద్దీన్, మల్లికార్జునరెడ్డి, సుధీర్, గణేష్, సుజాత, ఇర్ఫాన్, కిశోర్, సుధాకర్‌రెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

- వీఎస్‌యూలో..

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. వీసీ సారంగం విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను గ్లోబల్‌స్థాయికి తీసుకెళ్లాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్ శంకర్, సుజాఎస్ నాయర్, డాక్టర్ టీవీ సుబ్బారెడ్డి తదితరులున్నారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత

పనులు ప్రారంభించారు.. వదిలేశారు..

● నత్తనడకన హైవే-325 నెంబరు రోడ్డు పనులు ● వంతెనల నిర్మాణంతో రోడ్డు ధ్వంసం.. డైవర్షన్లు

జలదంకి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో జలదంకి నుంచి తెల్లపాడు మీదుగా కలిగిరి మండలాల్లోని గ్రామాల మీదుగా వెళ్లే సింగిల్ రోడ్డును హైవే-325 నెంబరు రోడ్డుగా మార్చేందుకు రూ.16కోట్లతో టెండర్లను పిలిచింది. పనులు దక్కించుకున్న జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించింది. మండలంలోని దాసరి అగ్రహారం, తిమ్మసముద్రం గ్రామాల సమీపంలోని వాగులు, వరదనీరు వెళ్లే ప్రాంతాలతో కల్వర్టు, వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. చేసిన పనులకు నిధులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. అధికారంలోకి కూటమి ప్రభుత్వం రెండు నెలల క్రితం రూ.4కోట్లు బిల్లులు మంజూరు చేసినా గుత్తేదారుడు పనులు ప్రారంభించలేదు.

సాఫీగా ఉన్న రోడ్డు ధ్వంసం..

జలదంకి-తెల్లపాడు సింగిల్‌లైన్ బీటీ రోడ్డు ఉన్నపుడు ఎక్కడా గతుకులు లేకుండా వాహనదారులు సాఫీగా ప్రయాణించేవారు. ఈ రోడ్డును స్టేట్‌హైవేగా మార్చుచేసి రెండులైన్ల రోడ్డుగా మారుస్తామని బాగున్న రోడ్డును ధ్వంసం చేయడం, కల్వర్టుల స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టే క్రమంలో వంతెనలు తొలగించి డైవర్షన్‌లు ఏర్పాటు చేయడం రోడ్డుకు ఇరువైపులా కంకరతోలి వదిలేశారు. రోడ్డు కట్ చేసిన చోట వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కల్వర్టులు, డైవర్షన్‌ల వద్ద వర్షపు నీరు పొంగి పారడంతో జలదంకి, కావలి పట్టణాలకే కాకుండా సుమారు 25గ్రామాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు.



తిమ్మసముద్రం సమీపంలో నిలిచిన వంతెన నిర్మాణం

పనులు ప్రారంభించాలి



బిల్లులు మంజూరై నెలలు గడుస్తున్నా కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. గత వైసీ పీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వక మూడేళ్లుగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో అయితే మా పరిస్థితి దయనీయం. వానాకాలంలో ఊరి నుండి జలదంకి, కావలికి రోజుల తరబడి రాలేని దుస్థితి. గతంలో బిల్లులు రాలేదని సాకులు చెప్పిన కాంట్రాక్టర్ బిల్లులు మంజూరైనా పనులు ఎందుకు చేపట్టడం లేదో అధికారులకే తెలియాలి.

- అంబటి హరిప్రసాద్‌నాయుడు, చింతలపాలెం

పనులు చేయమని నోటీసు ఇచ్చాం

నిలిచిపోయిన జలదంకి-తెల్లపాడు రోడ్డు పనులు చేయమని గుత్తేదారుడితో పాటు జీఎస్ఆర్ఇన్‌ఫ్రా సంస్థకు నోటీసు ఇచ్చాం. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, వానలు తగ్గితే పనులు చేపడతామని కాంట్రాక్టు చేపట్టిన సంస్థ బదులిచ్చింది. ఈ మేరకు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతాం.

- కె.చక్రధర్‌రావు, ఆర్అండ్‌బీ డీఈ, కావలి

పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు

● ఎస్.ఆదినారాయణ, కొండాపురం ఎంపీడీఓ

ఇంటర్వ్యూ...



మండలంలో 19, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆ దిశగా కార్యదర్శులతో పని చేయిస్తా మని ఎంపీడీఓ ఆది నారాయణ తెలిపారు.

? సచివాలయ అధికారులు సమ యపాలన పాటిస్తున్నారా!

! 13సచివాలయాలను తరచూ తనిఖీ చేపడతాం. విధులకు రాని సిబ్బందికి మెమోలు ఇచ్చాం.

? గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలు జరుగుతుందా!

! స్వర్ణగ్రామ్ పంచాయతీ యాప్‌లో 8500 ఇళ్ల డిజిటలైజేషన్ చేపట్టాం. దీనిద్వారా త్వరలో ఇంటిపన్ను వసూలు చేయనున్నాం.

? పంచాయతీల అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటున్నారు!

! ప్రతి మూడునెలలకోసారి సర్పంచ్ అధ్యక్షతన సభ్యులతో సమావేశం అవుతాం. సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి పరిష్కరిస్తాం.

? చెత్త సేకరణ జరుగుతుందా!

! చెత్త సేకరణకు కేటాయించిన గ్రీన్ అంబాసిడర్లకు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఈ సమస్యతో వారు విధులకు రావడం లేదు. సదరు గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి ఇటీవలే జీతాలు విడుదల చేయించాం.

చుండిలో శ్రమదానం



వలేటివారపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చుండిలో ఉత్తర బజారుకు వెళ్లే రోడ్లకు రెండువైపులా శుక్రవారం మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో గ్రామస్థులు శ్రమదానం చేశారు. 15రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రోడ్ల వెంబడి పిచ్చిమొక్కలు రోడ్లను కమ్మేశాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల్లో విషపురుగులు ఉండే అవకాశం ఉందని, విషపురుగుల నుండి పాదచారులకు ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చు అనే ఉద్దేశ్యంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వారు చెప్పారు.

ఖాదర్‌వలి గంధోత్సవం

అల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):స్థానిక మసీదు సెంటరులోని ఖాదర్‌వలి గంధ మహోత్సవం శుక్రవారం రాత్రి భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతెహాలను నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. దర్గా కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ నిరసన

కావలి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పట్టణంలో నిరసన చేపట్టారు. అంతకుముందు ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా విద్యుత్ డీఈ కార్యాలయం వరకు చేరుకున్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, దామిశెట్టి సుదీర్‌నాయుడు, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, కొమారి రాజు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి, పరుసు మాల్యాద్రి, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

● కందుకూరు: విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ కందుకూరులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా విప్పగుంటరోడ్డు చేపల మార్కెట్ సమీపంలోని విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం వరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాల్లో పింఛన్లు మినహా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నేటివరకు అమలుచేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, షేక్ రఫి, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, సాంబశివరాజు, చీమల రాజా, ఈదర రమేష్, గేరా మనోహర్, అయ్యన్న పాల్గొన్నారు.

● ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారం మోపుతోందంటూ నిరసన తెలియజేస్తూ పట్టణంలో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీ పీ శ్రేణులు పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సి పల్ బస్టాండ్ సెంటర్ నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేసి విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

● ఉదయగిరి: బూటకపు హామీలతో రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశాడని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయగిరి పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌కు ప్లకార్డులు చేతపట్టి నిరస న ర్యాలీ చేపట్టారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేజర్ల సుబ్బారెడ్డి, అలీఅహ్మద్, మోడి రామాంజనేయులు, గణపం బాలకృష్ణారెడ్డి, జీ.ఓబులరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉదయగిరి: ర్యాలీలో పాల్గొన్న నాయకులు



కందుకూరు: పాల్గొన్న బుర్రా మధుసూదన్ యాదవ్



ఆత్మకూరు: పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నేతలు

న్యూస్ బాక్స్

పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 31మందిని ఉద్యోగాలకు ఎంపికై నియామకపత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ మస్తానయ్య తెలిపారు. ఏపీఎస్ ఎస్డీసీ, నెల్లూరు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మేళాలో ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, అమర రాజా బ్యాటరీస్, శ్యామ్‌సంగ్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా సంస్థల హెచ్‌ఆర్‌లు పాల్గొని ఇంటర్వ్యూలు చేశారని తెలిపారు. 76మంది విద్యార్థులు హాజరవగా వారిలో 31మందిని ఎంపికైనట్లు చెప్పారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నాగూర్‌వలి

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్నారు షేక్ నాగూర్‌వలి. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి శాలువాతో సత్కరించారు. కళాశాలలో మధ్యాహ్నభోజన పథకం అమలు చేస్తున్నందున కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మస్తాన్‌వలి, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య స్పైస్ ఇండస్ట్రీస్ ప్రారంభం

కందుకూరు సమీపంలోని శింగరబొట్లపాలెం వద్ద కనిగిరి రోడ్డులో ఆదిత్య స్పైస్ ఇండస్ట్రీస్‌ను ఎమ్మెల్యే ఇంటూరి ప్రారంభించారు. నిర్వాహకులు కొణిజేటి రవికుమార్, అనిల్‌కుమార్‌లను ఎమ్మెల్యేయ అభినందించారు.

అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఔదార్యం

లింగసముద్రం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):ముత్యాలపాడు సచివాలయ విజేల్ అగ్రికల్చరల్ అసిసెంట్ జంగాల ప్రేమ్‌బాబు ఐదేళ్ల జుట్టుని పెంచి క్యాన్సర్ పేషంట్ల కోసం హైదరాబాద్ హెయిర్ డొనేషన్ సంస్థ ద్వారా దానం చేశారు. ట్రీట్‌మెంట్‌లో భాగాంగా జుట్టు రాలిపోయే పేషంట్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. పేషంట్ల ఆత్మ స్థైర్యాన్ని పెంచే కార్యక్రమంలో భాగసామ్యం అయినందుకు ప్రేమ్‌బాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రాజకీయాల్లోకి విద్యావంతులు రావాలి

బిట్రగుంట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే రాజకీయాల్లోకి చదువుకున్న యువత రావాలని బీజేపీ రాష్ట్ర ప్రతినిధి ఆర్డీ విల్సన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కమల కోరారు. బోగోలు బీజేపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడి నియామకం చేపట్టారు. నూకసాని శ్రీనివాసులును 32మంది బూత్ కమిటీ అధ్యక్షులు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మీ, కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం, నేతలు మాధవ, మురళీనాయుడు, తిరుపతమ్మ ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి ఎన్నిక

చేజర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా చేజర్లకు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఎన్నిక య్యారు. శుక్రవారం చేజర్లలో జరిగిన కమిటీ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు కడుముల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బత్తల కిష్టయ్య, కుంకు బాల య్య, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

కావలి టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రముఖ వైద్యులు ప్రభాకర్ నాయుడు పీఎస్ఆర్ ట్రస్ట్‌లతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, రత్నం, ఉదయ్ పాల్గొన్నారు.



కావలి : నివాళులర్పిస్తున్న ప్రభాకర్ నాయుడు తదితరులు

ఎమ్మెల్యే కాకర్ల సంతాపం

వింజమూరు: ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ప్రగతికి మెట్లు వేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే కాకర్ల శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటని సంతాపం వ్యక్తంచేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



కావలి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): చౌదరిపాలెంలో విద్యుత్ స్తంభానికి, తీగలకు కమ్మేసిన పిచ్చి చెట్ల తీగలతో ప్ర మాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆహార సలహా సంఘం సమావేశాలేవి?

● ఈ సంఘం సమావేశాలను పూర్తిగా విస్మరించిన వైనం
● వైసీపీ హయాంలో ఒక్క సమావేశం జరగలేదు

వలేటివారిపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఐదళ్ల నుండి ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించ లేదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ సంఘం సమావేశాలను పూర్తిగా విస్మరించింది. ఐదేళ్లలో ఏనాడు ఒక్క సమావేశాన్ని నిర్వహించిన దాఖలాలు కానీ ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును సమీక్షించింది లేదు. చివరికి ఆహార సలహ సంఘం ఉందనే సంగతి మరిచారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా రెవెన్యూ అధికారులు వాటిని కాగితాలకే పరిమితం చేశారు. ఈ సలహా సంఘం సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు ఇద్దరు సర్పంచులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, డ్వాక్రా మహిళ, తహసీల్దార్ ఏఎస్ఓ, ఉండాలి. ప్రతినెలా రెండో సోమవారం సమావేశం అయ్యేలా ప్రభుత్వం నుండి ఆదేశాలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఆహార సంబంధిత వస్తువులు, సరుకులు ధరలు పెరిగినపుడు ఆహార సలహా సంఘం కమిటీ సభ్యులు వాటిని గమనించి అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే వీలు ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆరోపణలు, అవినీతి, అక్రమాలు జరుగుతుంటే అధికారులను నిలదీస్తారు. మార్కెట్‌లో వంట నూనెలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరల అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఐదేళ్లలో గత వైసీపీ ప్రభుత్వం ఆహార సలహా సంఘం సమావేశాలు ఊసే లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ సంఘం సమావేశాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘర్షణపై కేసు నమోదు

కావలి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం మానం సురేష్ తనకు రైతుభరోసా పడలేదని గురువారం సిరిపు రంలో వ్యవసాయశాఖ అధికారితో చర్చిస్తున్నారు. ఈ సమయంలో అక్కడే ఉన్న ఉప్పాల జాలరావు వారి మధ్య కలుగజేసుకున్నారు. దీంతో ఇరువురి మధ్య జరిగిన వాగ్వివాదంలో జాలరావు దాడి చేసి నట్లు బాధితుడు సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లక్షీ హుడ్ జాతర విజయవంతం చేయాలి

కందుకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మెప్మాలో వందరోజుల లక్షీ హుడ్ జాతరను విజయవంతానికి ఆర్పీలు, సీఓలు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని మెప్మా పీడీ రాధమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారికి నిర్వహించిన శిక్షణలో పాల్గొని జాతర యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. సమావేశంలో కందుకూరు సీఎంఎం సంపత్, డీఈఓ శ్రవణ్ పాల్గొన్నారు. తొలిసారి కందుకూరు వచ్చిన ఆమెకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరించారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే ఇంటూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉలవపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి 2న స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశపెట్టనున్న మధ్యాహ్న భోజన పథకం ప్రారంభానికి ఉలవపాడు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యాపకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి ఆహ్వానించారు. ఆయన వెంట అధ్యాపకులు గారపాటి గోపిచంద్ ప్రకాష్, హనుమంతరావు, చల్లా శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ రాము ఉన్నారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతసాగరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ క్యాలెండర్‌ను కూటమి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతసాగరం చెరువు సొసైటి అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, బీజేపీ మండల కార్యదర్శి జగదీష్, టీడీపీ నేతలు చల్లాశివారెడ్డి, మెట్టుకూరు మనోజ్‌రెడ్డి, కేతా శ్రీనివాసులు రెడ్డి, బొర్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ఉదయగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో శుక్రవారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కార మార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు శివ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం : జండాదిబ్బలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో అందచేసిన అర్జీలను విచారించి గడువు లోపు పరిష్కరిస్తామన్నారు.



దుత్తలూరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు నాగరాజు

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని తహసీల్దారు సుభద్ర సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మడలంలోని చౌక దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ సమయం కావడంతో నిత్యావసర వస్తువుల పంపిణీలో సమయపాలన పాటిస్తూ ప్రతి కార్డుదారుడికి సరుకులు అందేలా చూడాలన్నారు. 1 నుంచి 17వ తేదీలోపు సరుకులు పంపిణీ పూర్తిచేయాలన్నారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, ఆర్ఐ సురేంద్ర, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

30న పంచాయతీలో వేలం

ఉదయగిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు డీఎల్‌పీవో ఆధ్వర్యంలో వివిధ అంశాలకు సంబంధించి వేలంపాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ కరీముల్లా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్‌లో పది గదులు, పంచాయతీ బస్టాండ్‌లో రాకపోకలు సాగించే ప్రైవేటు వాహనాల నుంచి రోజువారి రుసుం వసూలు, శిథిలావస్థకు చేరిన చెత్త ఆటోలు, రిక్షాలు, పాత ఇనుప వస్తువులకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సొసైటీలో యూరియా విక్రయాలు ప్రారంభం

సంగం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో యూరియా విక్రయాలను శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల సంగం సొసైటీకి 445 బస్తాల యూరియా సరఫరా అయింది. ఆమేరకు సొసైటీలో యూరియా విక్రయాలను ప్రారంభించినట్లు పీఏసీఎస్ కార్యదర్శి దస్తగిరి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీ నిర్మల, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ సీఈవో దస్తగిరి, సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు అమ్మకుండా చర్యలు

● చేజర్ల : మండలంలో ఎరువులు అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి విశశిధర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలలో వ్యవసాయశాఖ సిబ్బందిని ఉంచి ఎరువుల అమ్మకాలు జరిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా రైతు సేవా కేంద్రాలలో కూడా ఎరువులు విక్రయించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం లాభదాయకమని మండల ఆత్మకూరు ఏడీఏ వి దేవసేనమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని మహిమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో అందజేస్తున్న రాయతీలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి చంద్రశేఖర్, మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు, ఏపీసీఎస్‌పీ సిబ్బంది, వీఏడబ్ల్యూవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : భూసార పరీక్షలు చేసి నత్రజని వాడాలని మండల వ్యవసాయ అధికారి రజని రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె చౌటభీమవరం, పందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో జీవన ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి సాధించవచ్చని, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, వీఏఏలు పాల్గొన్నారు.



మహిమలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ వి దేవసేనమ్మ

అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభించాలి

సంగం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పూర్తవడంతో అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని ఎంపీడీవో షాలెట్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై ఎంపీడీవో సిబ్బందితో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ పథకంలో 90 పనిదినాలు, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్‌ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపి మంజూరు చేయించుకోవాలని తెలిపారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించడంతోపాటు రూ. 300 కూలి గిట్టుబాటు అయ్యేవిధంగా పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సీసీలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకంపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీవో షాలెట్